ఐదేళ్లపాటు పడకేసిన ప్రాజెక్టులకు ఆరు నెలల నుంచి మోక్షం వచ్చింది. వైసీపీ పాలనలో పోలవరం దగ్గర నుంచి డెల్టా ఆధునికీకరణ వరకు అన్నింటికీ గండాలే. వీటి పనులకు నిధులు కేటాయించినట్టే కేటాయించి చివరకు విడుదల కాకుండా నాటకాలాడి రైతులను మోసం చేశారు. ఆ నిర్లక్ష్యం స్థానంలో కూటమి ప్రభుత్వం ఎక్కడికక్కడ నిధులు, పనులు సమకూ ర్చింది. పోలవరాన్ని వచ్చే రెండున్న రేళ్లలో పూర్తి చేసేందుకు పనులకు అత్యవసర కార్యాచరణ ప్రకటించింది. డెల్టాలో కాల్వల పూడిక తీతకు ఎనిమిది కోట్లు విడుదల చేసింది. పశ్చిమకు నీటిపారుదల మంత్రిత్వ శాఖను కేటాయించడం ఇదే తొలిసారి. ఆ బాధ్యతను పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుకు అప్పగించారు. ఈ ఏడాది ఇవే జలవనరుల శాఖలో అతి ముఖ్య చర్యలు.

జలవనరులకు.. జవసత్వాలు



పోలవరం పర్యటనలో మంత్రి నిమ్మల రామానాయుడుతో సీఎం చంద్రబాబు (ఫైల్)



- ఈ ఏడాది జల వనరులు అటూ ఇటు
- వైఫల్యాలస్థానే పనులవైపు అడుగులు
- కేంద్రం సాయం.. రాష్ట్రం సంకల్పం
- పోలవరం పూర్తికి ప్రత్యేక కార్యాచరణ
- ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- పశ్చిమకు నీటిపారుదల మంత్రిత్వ శాఖ
- నిమ్మలకు అవకాశం.. పశ్చిమకు రూ.8 కోట్లు.. ముంపు నివారణకు చర్యలు

(ఏలూరు - ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జల వనరుల శాఖలో చీకటి వెలుగులున్నాయి. తొలి ఆరు నెలల్లో అధికారంలో ఉన్న వైసీపీ అప్పటివరకు పోలవరం ప్రాజెక్టును పడకేసేలా చేసింది. కేవలం ప్రాజెక్టు పనుల్లో ఇంతకుముందు టీడీపీ ప్రభుత్వం 72 శాతం పూర్తి చేయగా, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కేవలం 3.1 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఈ వ్యత్యాసాన్ని గమనిస్తే ఏ ప్రభుత్వంలో ఎంత పని జరిగింది ఇట్టే తెలుస్తుంది. దీనికితోడు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలులోను జగన్ ప్రభుత్వం చూసీచూడనట్టుగా వదిలేసింది. ఒకప్పుడు పోలవరం ప్రాజెక్టు పురోగతి ఎలా ఉందనే విషయాన్ని పక్కన పెట్టి కేవలం టీడీపీపై కక్ష పూరితంగానే అన్నట్టుగా వ్యవహరించింది. కుడికాల్వకు కనెక్ట్‌య్యేలా నిర్మిస్తున్న జంట గుహలు కుప్పకూలినా దిక్కుదివాణం లేదు. ఆఖరుకి ప్రధాన డ్యాం నిర్మాణానికి అడ్డంకిగా డయాఫ్రంవాల్ మారడానికి ఆనాటి ప్రభుత్వమే కారణ భూతమైంది. 2022లో డయాఫ్రంవాల్ గోదావరి వరదలతో దెబ్బ తింది. కనీసం నిపుణులతో చర్చించి ప్రత్యా మ్నాయం ఏం చేయాలనే దానిపైన సరైన నిర్ణయం తీసుకో లేకపోయింది. జల విద్యుత్ కేంద్రం పనులు ముందుకు వెళ్లక సాగిల పడ్డాయి. కనీసం కేంద్రాన్ని ఒప్పించి సంతృప్తికర నిధులు రప్పించారా అంటే దానిలోనూ విఫలమే. ఆర్‌అండ్‌ఆర్ పనుల్లోను ఇదే నిర్లక్ష్యం. నిర్వాసిత కుటుంబానికి రూ.ఐదున్నర లక్షలకు బదులుగా రూ.పది లక్షలు వ్యక్తిగత పరిహారం మంజూరు చేస్తామంటూ ఎన్నికల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిని గాలిలో కలిపారు. ఎన్నికలకు ముందు ఓట్లను దండుకునేందుకు కేవలం కొంతమందికి మాత్రమే వ్యక్తిగత పరిహారం వారి ఖాతాల్లో జమ చేశారు. పునరావాస కాలనీల్లో కనీస సౌకర్యాల కల్పనలోనూ వైసీపీ నిర్లక్ష్యం అంతాఇంతా కాదు. అతి ముఖ్యమైన మెట్టకు సాగు, తాగునీరు అందించే పథకాలను గోదారిలో కలిపినట్టుగా వ్యవహరించింది. కనీసం డెల్టా ఆధునికరణ పనులకు దిక్కులేకుండా పోయింది. ఏ బడ్జెట్‌లోనూ తగినన్ని కేటాయింపులు ఇవ్వలేదు. జగన్ ప్రభుత్వ హయాం అంతా జల వనరుల విభాగంలో అంతా నగుబాటగానే సాగింది.

మరో ఐదు రోజుల్లో 2024 సంవత్సరం వెళ్లిపోతోంది. 2025 వస్తున్న వేళ.. ఈ ఏడాది చోటు చేసుకున్న చీకటి వెలుగులను సమీక్షించుకుందాం. నీటిపారుదల శాఖ పనితీరును తెలుసుకుందాం.

జ్ఞాపకాలు 2024

కూటమిలో ప్రాజెక్టులు దీటుగా..

వైసీపీ పాలనలో ఏదైతే వైఫల్యాలను మూటకట్టుకుందో తాజాగా ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్వల్పకాలంలోనే విజయాల వైపు దూసుకెళ్తుంది. పోలవరం ప్రాజెక్టుకు జవసత్వాలు తెచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరిగి సోమవారం పోలవరంగా స్ఫూర్తి కొనసాగిస్తూ అధికార పగ్గాలు చేపట్టిన ఆరు నెలల్లోపే రెండుసార్లు ప్రాజెక్టును సందర్శించి పనులను పర్యవేక్షించి నిపుణులతో, ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఆ మేరకు కేంద్రానికి నివేదించారు. తగినన్ని నిధులు కోసం అభ్యర్థించే తడవుగా రూ.12,800 కోట్లు తక్షణ పనుల కోసం మొదటి దఫాగా కేంద్రం విడుదల చేసింది. కాలయాపన జరగకుండా నిపుణుల సలహాలు తీసుకుంటూనే పనుల పూర్తికి కాంటాక్టు ఏజెన్సీని అప్రమత్తం చేసి ఇంజనీర్లకు ఆ మేరకు బాధ్యతలు అప్పగించారు. వైసీ పీ హయాంలో దెబ్బతిన్న డయాఫ్రం వాల్ రెండోసారి నిర్మాణానికి సమా యత్తమయ్యారు. వైసీపీ పాలనలో పోలవరంను నిర్లక్ష్యం చేసిన పాపానికి దాదాపు 15 వేల కోట్ల నష్టం వాటిల్లినట్టుగా తాజాగా పోలవరానికి వచ్చిన సీఎం చంద్రబాబు ప్రకటించారు. పనిలో పనిగా వచ్చే ఏడాదిలోపే డయాఫ్రంవాల్ నిర్మాణం, సమాంతరంగా ప్రధాన డ్యాం (ఈసీఆర్ఎఫ్) నిర్మాణానికి నిపుణులు ఓకే చేసినట్టుగా తీపి కబురు అందించారు. ఫలితంగా పనుల్లో జాప్యం లేకుండా తొలుత డయాఫ్రంవాల్ నిర్మాణంతో సహా కుడి, ఎడమ కాల్వల కనెక్టవిటీల కోసం 2026 వరకు పనులు పూర్తయ్యేలా కార్యాచరణ ప్రకటించారు. ఒక ప్రధాన డ్యాం నిర్మాణంలో పనుల పూర్తికి ఈ తరహా కార్యాచరణ ప్రకటించడం ఇదే ప్రథమం. పోలవరం ప్రాజెక్టు ఎట్టి పరిస్థితుల్లో పూర్తికే కంకణం కట్టుకోవడం రైతువర్గాలకు ఓ వరంగా చెప్పవచ్చు. పశ్చిమ డెల్టాకు ఈ ఏడాది కలిసి వచ్చింది. అధిక వర్షాలకు పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి. డ్రెయిన్లు పూడుకుపోయాయి. పూడిక తీయడానికి ఆగమేఘాలపై నిధులు కేటాయించారు. సుమారు రూ.8 కోట్లు మంజూరు చేశారు. గుర్రపు డెక్క, తూడు తొలగించారు. పూడిక తీయించారు.

ఎత్తిపోతలకు ఇక మోక్షమే..

మెట్ట ప్రాంతానికి సాగు, తాగునీరు ఇవ్వడానికి ఉద్దేశించిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ఐదేళ్ల పాటు వదిలేశారు. బడ్జెట్‌లో కేటాయింపులు ఇచ్చి కాగి తాల మీద లెక్కలు చూపించారు. తాడిపూడి నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లా వరకు గోదావరి జలాల తరలింపుకు వీలుగా టీడీపీ హయాంలో రూ.4,890 కోట్ల వ్యయంతో అప్పట్లో ప్రతిపాదనలు ఆమోదించారు. కాని గత ఐదేళ్ల ఇవేమీ వైసీపీ ప్రభుత్వానికి పట్ట లేదు. కనీసం రిజర్వాయర్ల నిర్మాణానికి అధి కారులు సమీక్షించలేక పో యారు.



కూటమి ప్రభుత్వం వీటిపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రెండు దశలుగా విభజించి మొదటి దశను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు 2 వేల 800 కోట్లు కేటాయించేందుకు ముందుకొచ్చింది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ మేరకు కేటా యింపులు చేసింది. జల్లేరు వద్ద జలాశయం నిర్మాణం పూర్తి చేసి తొలిదశలో పూర్తిస్థాయి నీరందించాలన్న సంకల్పానికి వచ్చారు. ఎర్రకాల్వ జలాశయం పరిధిలో కుడికాల్వ ఆధునికీకరణకు ఊత మిచ్చింది. తమ్మిలేరు జలాశయం అభివృద్ధి పను లకు ఓకే చేసింది. గతంలో నీరు-చెట్టు పథకం కింద ఇవ్వాల్సిన బకాయిలను తీర్చేం దుకు ప్రయత్నించింది. ఏడాది చివర్లో రైతులకు ఊత మిచ్చేలా సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి.. కూటమి ప్రభుత్వం శభాష్ అనిపించుకుంది.



తూడు తొలగించిన తర్వాత.. కాల్వ



అడ్డంకులు లేకుండా వడివడిగా.. జల ప్రవాహం

నేటి నుంచి చెరుకువాడ రైల్వేగేటు మూసివేత

ఉండి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ట్రాక్ మరమ్మతుల దృష్ట్యా చెరుకువాడ రైల్వే గేటును శుక్రవారం నుంచి వచ్చే జనవరి 4వ తేదీ వరకు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ట్రాక్ సిమెంట్ స్లీవర్స్ మార్పు, పట్టాల కింద రాళ్ల తొలగింపు పనులను చేయనున్నట్లు వివరించారు. చెరుకువాడ నుంచి అర్తమూరు, కవిటంపాకలు వెళ్లే ప్రజలు ఉండి మీదుగా ఉప్పుగుంట నుంచి వెళ్లాలని కోరారు.

కొల్లేరు కబ్జాలపై కన్నెర్ర

అక్రమ చేపల చెరువుల గట్లకు గండ్లు

ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్న కొల్లేరు గ్రామాల పెద్దలు

గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా అభయారణ్యంలో తవ్వకాలు

సుప్రీంకోర్టు నివేదిక కోరడంతో రంగంలోకి అటవీ అధికారులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో కొల్లేరు అభయారణ్యంలో ఇష్టానుసారంగా తవ్విన చేపల చెరువులను అటవీ శాఖ అధికారులు ధ్వంసం చేస్తున్నారు. సాధికారిక కమిటీ పరిధిలో ఉన్న కొల్లేరు సరస్సులో ఐదేళ్లల్లో పర్యావరణ పరిరక్షణకు ఏ విధమైన చర్యలు చేపట్టలేదు. పైగా వేలాది ఎకరాల్లో అక్రమంగా చేపల చెరువులు తవ్వేశారు. దీనిపై సుప్రీం కోర్టులో మృత్యుంజయరావు అనే వ్యక్తి కేసు వేశారు. దీనిపై సుప్రీంకోర్టు కొల్లేరు ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వడంతో అటవీ శాఖ ఆ దిశగా చర్యలు చేపట్టింది.

కైకలూరు/ఏలూరు రూరల్/పెదపాడు/భీమడోలు/ఆకివీడు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కొల్లేరు గ్రామాల్లో యథేచ్ఛగా అక్రమ చేపల చెరువులు తవ్వకాలు చేశారు. ఇప్పుడు ఆ చెరువులకు గండ్లు పెట్టేందుకు అటవీ శాఖ అధికారులు సన్నద్ధం కావడంతో ఆయా గ్రామాల పెద్దలకు లీజు తీసుకున్న వారికి మింగుడుపడడం లేదు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఆకివీడు, పైడి చింతపాడు, యాగినమిల్లి, దెందులూరు, పెదపాడు, నిడమర్రు మండలాల్లో 200 ఎకరాలకు పైబడిన ఒక్కో చెరువులను అప్పుడు నేతల కనుసన్నల్లో తవ్వేశారు. కైకలూరు, మండవల్లి మండలాల్లో కొల్లేరు ఆపరేషన్ సమయంలో ధ్వంసం చేసిన గట్లు స్థానంలో తాత్కాలికంగా అడ్డుకట్లు వేసిన వాటిని తొలగించేందుకు అటవీ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఆకివీడు, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల్లో చెరువులకు గండ్లు పెట్టారు. దీంతో కొల్లేరు గ్రామాల్లో అలజడి నెలకొంది. ప్రజల్లో ఇప్పటి వరకు అక్రమంగా సాగు చేసిన చేపల చెరువుల నుంచి వచ్చిన ఆదాయాన్ని ఆయా గ్రామ ప్రజలు గ్రామ కట్టుబాట్ల మధ్య వాటాలు పంపకాలు చేసుకుంటారు. గట్లు ధ్వంసంతో ప్రజా ప్రతినిధుల వద్దకు పెద్దలు పరుగులు తీస్తున్నారు. అక్రమంగా కొల్లేరులో తవ్విన చేపల చెరువులను ఎకరం రూ.లక్ష లీజుకు బడాబాబులకు అప్పగించారు. వారికున్న ఆర్థిక, అధికార అంగబలాలతో గట్లు ధ్వంసం చేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ముందుగా ప్రభుత్వ భూమిలోని అక్రమ చేపల చెరువులను ధ్వంసం చేసి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేయాల్సి రావడంతో అటవీ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

మండలాల వారీగా ధ్వంసం

ఏలూరు రూరల్ మండల పరిధిలో 3,500కు పైగానే అక్రమ చేపల చెరువులు తవ్వకం సాగినట్టు తెలుస్తోంది. రెండు రోజులుగా ఏలూరు రేంజ్ పరిధిలోని అటవీశాఖ అధికారులు గుటు చప్పుడు కాకుండా పెదయాగినమిల్లి 40, లింగారావుగూడెం 20, కోమటిలంకలో 90, చాటపర్రులో 40 ఎకరాల్లోని గట్లు ధ్వంసం చేశారు. పెదపాడు మండలం జయపురం సమీపంలోని కొల్లేరు భూముల్లో 50 ఎకరాల అక్రమ చేపల చెరువులను గుర్తించారు. వాటిల్లో 30 ఎకరాల్లోని చేపల చెరువుగట్లను తొలగించినట్లు మత్స్యశాఖ అధికారి శ్రీధర్ తెలిపారు. పెద్ద విస్తీర్ణంలో వున్న ప్రభుత్వ భూముల్లో చెరువులను తొలగించామని విస్తీర్ణం తక్కువున్న చెరువులను త్వరలో తొలగిస్తామన్నారు. మూడు రోజులుగా భీమడోలు మండలంలోని ఎనిమిది చెరువులకు అధికారులు గండ్లు కొట్టారు. మరో ఐదు చెరువులను ధ్వంసం చేయనున్నట్టు సమాచారం. ఉంగుటూరు నియోజకవర్గ కొల్లేరు గ్రామాల్లో నాలుగు వేల ఎకరాల్లోని అక్రమ చెరువులను ధ్వంసం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు తెలిసింది. ఈ వ్యవహారంపై అటవీ శాఖ అధికారులు సమాచారాన్ని దాటవేస్తున్నారు. నిడమర్రు మండలంలోను పలు చేపల చెరువులకు గండ్లు కొట్టారు. ఆకివీడు మండలం పెదకాపవరం, చినకాపవరం, చినిమిల్లిపాడు ప్రాంతాల్లో కాంటూరు పరిధిలో ఆక్వా సాగు ఎక్కువగా సాగవుతున్నది. త్వరలో ఇక్కడ అక్రమ చెరువులను తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు.

ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో దగ్గరుండి గట్లు ధ్వంసం చేయిస్తున్న అటవీ శాఖ అధికారులు



జయమంగళ జనసేనలో ప్రవేశం ఎప్పుడు?



సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న జనసేన కండువాతో జయమంగళ ఫొటో

కైకలూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గ రాజకీయంలో మరో కీలక మలుపు చోటు చేసుకోనుంది. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ తన పదవీకి రాజీనామా చేసి జనసేనలో చేరుతున్నట్టు ఇప్పటికే వార్తలు చక్కెర్లు కొడుతున్నాయి. అయితే ఆయన ఎప్పుడు జనసేన పార్టీలో చేరతారనే దానిపై సందిగ్ధం నెలకొంది. నెల రోజులు క్రితం ఎమ్మెల్సీ పదవి రాజీనామా చేసినప్పటి నుంచి జనసేన, టీడీపీలో ఈ ఊహాగానాలపై పెద్దఎత్తున చర్చ జరిగింది. గురువారం ఆయనకి జనసేన అధ్యక్షుడిని కలిసేందుకు పిలుపు రావడంతో మరలా కైకలూరు నియోజకవర్గంలో చర్చకు దారి తీసింది. ఆయన గతంలో టీడీపీలో 1999లో చేరి 2023 ఫిబ్రవరి వరకు పనిచేశారు. 2009 నుంచి 2014 వరకు కైకలూరు ఎమ్మెల్యేగా చేసిన వ్యక్తి వైసీపీలో చేరి అనూహ్యంగా ఎమ్మెల్సీ పదవిని చేజిక్కించుకున్నారు. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడంతో కొల్లేరు గ్రామాల్లోని ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం లేదని జయమంగళ అధికార పార్టీలైన టీడీపీ, జనసేన వైపు చూశారు. జనసేన పార్టీకి చెందిన గుంటూరు జిల్లా నేత బాలినేని శ్రీనివాసరెడ్డి చక్రం తిప్పడంతో జయమంగళ జనసేనలోకి వెళ్లడానికి సముఖత చూపారు. దీంతో గతనెల 23వ తేదీన శాసన మండలి సభ్యత్వానికి, వైసీపీకి రాజీనామా చేశారు. సోషల్ మీడియాలో జనసేనపార్టీ కండువా కప్పుకొని ఫొటోలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే గురువారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జనసేన రాష్ట్ర అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను జయమంగళ కలుస్తున్న నేపథ్యంలో మరలా నియోజక వర్గంలో ఆయన రాజకీయ భవిష్యత్తుపై తీవ్రస్థాయిలో చర్చ ప్రారంభమైంది. మరోవైపు ఎమ్మెల్సీ రాజీనామాను శాసన మండలి ఆమోదించకపోవడంతో ఆయన పార్టీ మార్పుపై పార్టీ శ్రేణుల్లో సందిగ్ధం నెలకొంది. అయితే అనూహ్యంగా పవన్‌కల్యాణ్‌ను కలవడంతో రాజీనామాను ఆమోదించకపోయినా జనసేనలో చేరుతారని ఊహాగానాలు జరుగుతున్నాయి. దీనిపైన 'ఆంధ్రజ్యోతి' జయమంగళను ప్రశ్నించగా పవన్‌కల్యాణ్‌ను కలుస్తున్న మాట వాస్తవమేనని జనసేనలో ఎప్పుడు చేరేది త్వరలోనే ప్రకటిస్తారన్నారు.

రోడ్డుపైనే ధాన్యం



తిమ్మారావుగూడెంలో చిరిగిపోయిన గోనెసంచుల్లోనే ధాన్యం

ఏలూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌లో పండించిన వరి ధాన్యాన్ని అమ్ముకునేందు కు రైతులు తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నా అధికారులు సరైన ప్రణాళికను అమలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు సిబ్బంది కొరత, ఖాళీ సంచుల లోటు వేధిస్తున్నాయి. ఏలూరు రూరల్ మండలంలో సుమారు 16 వేల ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు అయింది. ఇటీవల అల్పపీడనం కారణంగా వర్షం కురిసింది. పొలాల్లో ధాన్యం నూర్చి కల్లాలు, లేఅవుట్ స్థలాలు, రహదారుల వెంబడి ఆరబెట్టారు. మరో రెండు రోజులు ఆర బెట్టుకుని మిల్లులకు విక్రయించ వచ్చని రైతులు భావిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తగినన్ని సంచులను సమకూర్చలేదు. ఆన్‌లైన్‌లో 45 కిలోల బస్తాకు మాత్రమే అనుమతి ఉంది. ఆ సంచులను సరఫరా చేయలేదు. ఖాళీ సంచులు ఇచ్చినా ఎక్కువశాతం చిరిగిపోయాయి.



రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

ప్రజల మనస్సులో బడేటి బుజ్జికి సుస్థిరస్థానం

- రాష్ట్ర మంత్రులు కొలుసు, నిమ్మల
- ఏలూరులో బుజ్జి కాంస్య విగ్రహావిష్కరణ

ఏలూరు టూటౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సుస్థిరస్థానం పొందిన ప్రజా నాయకుడు బడేటి బుజ్జి అని రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఎస్ఆర్.పేట జడ్పీ కార్యాలయం వద్ద ఫ్లాస్‌టీమ్ ఆధ్వర్యంలో బడేటి కోటరామారావు (బుజ్జి) 5వ వర్ధంతి పురస్కరించుకుని ఆయన కాంస్య విగ్రహాన్ని మంత్రులు కొలుసు, నిమ్మల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి బడేటి బుజ్జి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన మృతి పేదలకు, తెలుగుదేశం పార్టీకి తీరని లోటని అన్నారు. ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి మాట్లాడుతూ బడేటి బుజ్జి మన మధ్యలో లేకపోయిన ప్రజల మనస్సులో శాశ్వతంగా నిలిచిపోయారన్నారు. మేయర్ నూర్జహాన్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ, కో ఆప్షన్‌సభ్యుడు పెదబాబు, ఆంజనేయులు, ఎంఆర్డీ బలరామ్, కార్పొరేటర్లు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బడేటి బుజ్జి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు కొలుసు పార్థసారథి, నిమ్మల రామానాయుడు

నిందితురాలిగా పదేళ్ల కుమార్తె

యండగండి పార్శిల్‌లో మృతదేహం కేసు.. విస్తుపోయే నిజాలు

పర్లయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడు శ్రీధర్‌వర్మ.. సహకరించిన మూడో భార్య కుమార్తె.. అవాక్కయిన పోలీసులు

అతని నేర స్వభావంపై గ్రామస్థుల్లో ఆందోళన

నేడు మీడియాకు వెల్లడించనున్న ఎస్పీ నయీం

భూమి.. బూమ్!



పంట భూముల ధరలకు రెక్కలు.. ఎకరాకు రూ.4 లక్షల వరకు విలువ పెంపు

పట్టణం, పల్లె తేడా లేకుండా నూతన సంవత్సరం వేళ భూముల ధరలు ఒక్కసారిగా పెరగబోతున్నాయి. ఆ మేరకు సబ్ రిజిస్ట్రార్‌లు ఇప్పటికే భూముల విలువను పెంచుతూ ప్రతిపాదనలు చేశారు. ఎక్కడికక్కడ పంట భూములు, లేఅవుట్‌లుగా విభజించి 2023 నాటి పెరిగిన భూమి విలువలతో సరిపోల్చుకుని తాజాగా పెంచే భూమి విలువలను సరిచూసుకుని మరీ ప్రతిపాదించారు. 10 నుంచి 15 శాతం మేర భూమి విలువ పెరగబోతుంది. ఆ మేరకే ఇకముందు రిజిస్ట్రేషన్ల ధరలు ఉంటాయి.

ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- ఇంటి స్థలం గజానికి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు పెరుగుదల
- కమర్షియల్ ప్రాంతాల్లో గరిష్ఠంగా రూ.5 వేల పెంపు
- పంట భూములకు మంచి కాలం
- విలువ పెంపు ప్రతిపాదనలు కొత్త సంవత్సరం నుంచి అమలు?
- గడువుకు ముందు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిట

భూముల విలువ ప్రభుత్వం మరోసారి పెంచబోతుంది. మెట్ట, మాగాణి, పండ్ల తోటలతో పాటు వివిధ లేఅవుట్‌లలో గతంలో పెంచిన భూమి విలువలను సవరించి ప్రతిపాదిత ధరలను ఇప్పటికే రిజిస్ట్రేషన్ కార్యాలయాల నోటీసు బోర్డులో ఉంచారు. జనవరి ఒకటి నుంచి ప్రతిపాదిత ధరలతో రిజిస్ట్రేషన్లు జరగబోతున్నాయని అంచనా.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇప్పటికే భూముల విలువలను 10 నుంచి 15 శాతం మేర పెంచుతూ కొత్త ధరలను ప్రతిపాదించారు. వాస్తవానికి 2023లో అప్పటి వైసీపీ ప్రభుత్వం భూమి విలువను పది శాతం మేర పెంచింది. అప్పట్లో పెంచిన విలువలతో రిజిస్ట్రేషన్ ద్వారా లభించే ఆదాయాన్ని మరింత పెరిగేలా చేసింది. తాజాగా ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం మరింత పెరిగేలా జాగ్రత్తపడుతోంది. ఇప్పటికే అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల ప్రతిపాదిత విలువను లెక్కించి ప్రజాభిప్రాయం నిమిత్తం బహిర్గతం చేయాల్సిందిగా ఆదేశించింది. ఈ మేరకు జేసీ ధాత్రిరెడ్డి నేతృత్వంలో గత వారమే సబ్ రిజిస్ట్రార్‌లతో ప్రత్యేక సమీక్ష జరిగింది. ఎక్కడెక్కడ భూముల విలువ ఎంత శాతం పెంచితే రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం వస్తుందో సూచాయగా నిర్ణయించారు. భూమి యజమానులు భూమి అమ్మకాల్లో లాభపడతారు. కొనుగోలుదారులు కాస్తంత భారాన్ని మోయాల్సి రావచ్చు.

నివాసయోగ్య భూ విలువ పెంపు

నివాస యోగ్యమైన స్థలాల విలువ 10 నుంచి 15 శాతం మేర పెరగబోతున్నాయి. మిగతా భూములతో పోలిస్తే పండ్ల తోటలకు నెలవైన భూముల ధరలు కాస్త అటుఇటూగా ఉండేవి. కాని ఈసారి వాటి విలువ భారీగా పెరిగినట్టు ప్రతిపాదిత విలువను బట్టి నిర్ధారణ అవుతోంది. ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో భూమి విలువ గజం రూ.13 వేల నుంచి రూ.16 వేల వరకు పెరగబోతుంది. ఇటీవల నగరంలో విలీనమైన ఏడు గ్రామాల పరిధిలో గజం రూ.3 వేలు విలువ పెరగబోతుంది. ఇవన్నీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అంచనాల్లో ఉన్నాయి.

ఏలూరు పరిసరాల్లో ప్రతిపాదిత విలువ

ఏలూరు పరిసర ప్రాంతాల్లో భూములతోపాటు లేఅవుట్‌ల భూముల ధరలు భారీగానే పెరగబోతున్నాయి. ఇప్పటికే నిర్ధారించిన శనివారపుపేట ప్రాంతంలో మాగాణి రకం ఎకరా భూమి ఇంతకు ముందు రూ.37 లక్షలు ఉండగా ఇప్పుడు దాని విలువ రూ.42 లక్షలకు ప్రతిపాదించారు. మెట్ట ఎకరానికి కూడా ఇదే ధర ఉండబోతుంది. ఏలూరు పరిసరాల్లో ఉన్న లేఅవుట్‌లలో గజం పాత ధర రూ.13 వేలు కాగా, ఇప్పుడు ప్రతిపాదిత ధర రూ.14 వేలు. దుగ్గిరాలలో మాగాణి ఎకరా రూ.22 లక్షల నుంచి రూ.25 లక్షలకు, మెట్ట రూ.21 నుంచి రూ.24 లక్షల వరకు పెరగబోతుంది. పెదపాడులో మాగాణి రూ.17 లక్షల నుంచి రూ.20 లక్షలకు, మెట్ట రూ.16 నుంచి రూ.19 లక్షలకు పెరిగే అవకాశాలు ఉన్నాయి. దొండపాడులో మాగాణి రూ.17 లక్షల నుంచి రూ.20 లక్షలకు, మెట్ట రూ.16 నుంచి రూ.19 లక్షలకు, వట్లూరులో మాగాణి రూ.24 నుంచి రూ.27 లక్షలకు, మెట్ట రూ.23 నుంచి రూ.26 లక్షలకు విలువ పెంచనున్నారు. ఏలూరు పరిసరాలు, దెందులూరు నియోజకవర్గ పరిధిలో భూముల విలువ సరాసరిన ఎకరాకు మూడు లక్షలు విలువ పెంచబోతున్నారు. ఇదే విషయాన్ని సబ్ రిజిస్ట్రార్‌లు తమ ప్రతిపాదనల్లో అధికారికంగా చూపించారు.

ఏలూరు నగరంలో అనూహ్యం!

ఏలూరు నగరంలో భూముల విలువ అనూహ్యంగా పెరగనుంది. కమర్షియల్ ప్రాంతాల్లో గజం రూ.70 వేలకు పైబడే ఉంది. ఇప్పుడు ఆ ధర 10 నుంచి 15 శాతం మేర పెంచితే గజం అధికారికంగా రూ.80 వేలు కానుంది. అనధికారికంగా ఇప్పటికే ఆర్‌ఆర్‌పేట, ఎన్‌ఆర్‌పేట వంటి ప్రాంతాల్లో గజం రూ.లక్షా 20 నుంచి రూ.లక్షా 40 వేల వరకు భూములు అమ్ముడవుతున్నాయి. నూజివీడు వంటి మునిసిపల్ ప్రాంత పరిధిలోని కమర్షియల్ ప్రాంతాల్లో ఇంతకు ముందు గజం రూ.30 వేలు ధర పలుకుతుండగా ఇప్పుడు ఆ ధర కాస్తా రూ.35 వేలకు చేరనుంది. నూజివీడు పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు కూడా పుంజుకోబోతున్నాయి. నూజివీడులో మెట్ట భూములు ఎకరా రూ.45 లక్షలు, మాగాణి భూములు రూ.46 లక్షలు, మామిడి తోటలు రూ.47 లక్షలకు పెరగబోతున్నాయి. ఆగిరిపల్లి మండల ప్రాంతంలో మామిడి ఎకరా రూ.20 లక్షలు, మాగాణి రూ.19 లక్షలు వరకు భూమి విలువలు పెరగబోతున్నాయి. నూజివీడు రూరల్ ప్రాంతంలో మెట్ట ఎకరా భూమి రూ.12 లక్షలకు ఎగబాకింది. కైకలూరులో గజం రూ.7,500 ఉండగా, ప్రతిపాదిత విలువను బట్టి రూ.8,500 వరకు పెరగనుంది. అదే గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,100 నుంచి రూ.1,500 విలువ పెంచబోతున్నారు. జంగారెడ్డిగూడెంలో గజం రూ.6,500 నుంచి రూ.7,500 వరకు పెంచనున్నారు. ఇక్కడే రాజులకాలనీలో గజం రూ.9,500 నుంచి రూ.10,500 వరకు పెరగబోతుంది. రూరల్ ప్రాంతంలో రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెరగనున్నట్టు చెబుతున్నారు. చింతలపూడిలో గజం రూ.30 వేలు ఉండగా, ఇప్పుడు ఆ ధర రూ.35 వేలకు ప్రతిపాదించారు. సరాసరి ప్రతిపాదిత విలువ 15 శాతం మేర ఉన్నట్టు చెబుతున్నారు. భూముల విలువ భారీగా పెరగనుండగా ఆ మేరకు రిజిస్ట్రేషన్ల ఆదాయం భారీగా పుంజుకోనుంది. సబ్ రిజిస్ట్రార్లు ప్రతిపాదించిన భూమి విలువలకు చాలాచోట్ల ప్రభుత్వం ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. ఈనెల 28 నాటికి ప్రతిపాదిత ధరలను నోటిఫై చేస్తారని చెబుతున్నారు. ఇదే జరిగితే కొత్త సంవత్సరం నుంచే పెరిగిన ధరలతో రిజిస్ట్రేషన్లు ఉండబోతున్నాయి.



రిజిస్ట్రేషన్‌ల నిమిత్తం కక్షిదారులతో కిటకిటలాడుతున్న ఏలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ధర పెరుగుతుందని ముందే రిజిస్ట్రేషన్.!

భూముల విలువ పెరగనుండడంతో ఆ మేరకు రిజిస్ట్రేషన్ చార్జీలు భారమవుతాయని ఎక్కడికక్కడ అప్రమత్తమయ్యారు. గురువారం మంచి రోజు ముహూర్తంగా భావించి జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు రిజిస్ట్రేషన్ల నిమిత్తం వచ్చిన కక్షిదారులతో కిటకిటలాడాయి. సరాసరి 40 నుంచి 50 వరకు రిజిస్ట్రేషన్లు అయ్యే కార్యాలయాల్లో రెట్టింపు జరిగాయి. నూజివీడు, వట్లూరు, ఏలూరు, జంగారెడ్డిగూడెం తదితర రిజిస్ట్రార్ కార్యాలయాలల్లో మధ్యాహ్నం వరకు జనం కిటకిటలాడుతూనే కనిపించారు.

పశ్చిమలో 10 నుంచి 20 శాతం పెరుగుదల

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమ గోదావరి జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపుపై ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. భీమ వరంలో జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌లతో జాయింట్ కలెక్టర్ గురువారం సమీక్ష నిర్వహించారు. పెంచిన ప్రతిపాదనలపై సంతకాలు చేశారు. జడ్పీ సీఈవో, యుడా ఛైర్మన్ సంతకాలు చేయాల్సి ఉంది. అనుమతి వచ్చిన వెంటనే భూముల రిజిస్ట్రేషన్ విలువ పెరగనుంది. జనవరి 1 నుంచే పెంచనున్నట్టు రిజిస్ట్రేషన్ శాఖ ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయంపైనే అంతిమంగా పెంపు ఆధారపడి ఉంటుంది. ధరలు పెరుగుతాయన్న ఉద్దేశంతో ముందుగానే రిజిస్ట్రేషన్‌లు నిర్వహించడానికి భూముల క్రయవిక్రయదారులు ఎగబడుతున్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ధరలు పెంచుతూ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాలోని 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 10 నుంచి 20 శాతం వరకు ధరలను పెంచారు. ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూముల విలువను కూడా పెంచారు. డిమాండ్ ఉన్న చోట 20శాతం వరకు విలువ పెంచుతూ ప్రతిపాదనలు రూపొందించారు. కనిష్ఠంగా 10శాతం పెరుగుతున్నాయి. భీమవరంలో కేవలం 10శాతం ధర పెంచడానికే అధికారులు పరిమితమయ్యారు. వైసీపీ హయాంలో జిల్లా కేంద్రమంటూ ఈ పర్యాయాలు ధరలు పెంచేశారు. ఇప్పుడు మళ్లీ పెంచితే జనం నుంచి వ్యతిరేకత వస్తుందన్న ఉద్దేశంతో జాతీయ, రాష్ట్ర రహదారులకు ఆనుకుని భూములను మాత్రమే పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. రిజిస్ట్రేషన్‌లు కానిచోట పెంచలేదు. భీమవరంలో గునుపూడి ఇతర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువ కంటే మార్కెట్ ధర తక్కువగా ఉంది. అటువంటి చోట్ల ధర పెంచేందుకు అధికారులు సాహసించలేదు. తాడేపల్లిగూడెంలో గజం స్థలం కనిష్ఠ ధర రూ. 10వేల వరకు ఉంది. అక్కడ రూ. 11వేలు చేశారు. రూ.13వేలు గజం ఉన్న చోట రూ. 14500 చేస్తూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అత్యధిక ధరలున్న ప్రధాన మార్కెట్ రహదారిలో అధికారులు ఆచితూచి వ్యవహరించారు. తణుకు, పాలకొల్లు, నర్సాపురంలో ఇదే తరహాలో ప్రతిపాదనలు రూపొందించారు.

వైసీపీ పాలనలో కిందికి..

పట్టణాలతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో ధరలు పెరగనున్నాయి. వైసీపీ పాలనలో రియల్ భూమ్ లేక భూముల క్రయ విక్రయాలు పెద్దగా లేవు. భూమి విలువ కూడా అంతంతమాత్రమే పెరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే భూమి విలువ పెంపుతో సంబంధం లేకుండానే ధరలు పెరిగాయి. ప్రస్తుత విలువ పెంపునకు ప్రభుత్వం అనుమతి నిరాకరిస్తే ప్రతిపాదనలు వాయిదా పడనున్నాయి. అనుమతిస్తే జనవరి 1 నుంచి కొత్త ధరలు అమలులోకి రానున్నాయి. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ధరలను బేరీజు వేశారు. ఆ మేరకు ధరల పెంపు ప్రతిపాదన చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో క్రయ విక్రయాలు జరగకపోయినా స్థల యజమానులు అధిక ధరలు చెపుతున్నారు. ధర పెరుగుతుందని వ్యవసాయ భూములు, స్థలాలను కూడా వాయిదా వేసుకున్నారు. వైసీపీ పాలనలో ధరలు పతనమయ్యాయి. ఎకరానికి రూ. 20 లక్షలకు పడిపోయింది. పట్టణాల్లో ఆస్తులు కొనుగోలుకు ఏ ఒక్కరూ ఆసక్తి చూపలేదు. రిజిస్ట్రేషన్ ఆదాయం దారుణంగా పడిపోయింది. కూటమి ప్రభుత్వంలో బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలు పెరుగుతాయన్న భరోసా జనంలో ఏర్పడింది. జాతీయ రహదారులకు ఆనుకుని వెంచర్‌లు వేయడానికి రియల్టర్‌లు ఆసక్తి చూపుతున్నారు. అమరావతి రాజధాని ప్రభావం కూడా జిల్లాలో కనిపిస్తోంది. భవిష్యత్‌లో రియల్ భూమ్ వస్తుందని ఆశిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే రిజిస్ట్రేషన్ విలువను పెంచేందుకు రిజిస్ట్రేషన్ శాఖ కసరత్తు పూర్తి చేసింది.



కక్షిదారులతో రద్దీగా ఉన్న ఆచంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్‌ల జోరు

ఆచంట: కొత్త సంవత్సరంలో భూమి విలువలు పెరుగుతాయని అధికారులు చెప్పడంతో వారం రోజులుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కక్షిదారులతో కిటకిటలాడుతున్నాయి. కొన్ని రోజులుగా రిజిస్ట్రేషన్‌లు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల ప్రభుత్వానికి రెవెన్యూ కూడా ఎక్కువగానే వచ్చింది. ఆచంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజూ నాలుగైదు రిజిస్ట్రేషర్లు జరిగాయి. భూమి విలువ పెంపు సమాచారంతో 2 రోజులుగా కార్యాలయంలో 20కి పైగానే రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం.



అల్లూరి స్మృతివనం పనులు పరిశీలిస్తున్న జాయింట్ సెక్రెటరీ ఉమా నందూరి, కలెక్టర్ నాగరాణి

అల్లూరి స్మృతివనం మరింత అభివృద్ధి

జాయింట్ సెక్రటరీ ఉమా నండూరి, కలెక్టర్ నాగరాణి పరిశీలన

భీమవరం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు విగ్రహ ప్రాంగణం (స్మృతి వనం) మరింత సుందరంగా, ఆహ్లాదకరంగా అభివృద్ధి చేయాలని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని అజాది కా అమృత్ మహోత్సవం సెక్రటేరియట్ జాయింట్ సెక్రటరీ ఉమా నందూరి అన్నారు. కేంద్ర సాంస్కృతిక శాఖ సహకారంతో ఏర్పాటుచేసిన అల్లూరి స్మృతి వనం అభివృద్ధి పనులను కలెక్టర్ నాగరాణితో కలిసి గురువారం పరిశీలించారు. స్మృతి వనం వద్ద ఫౌంటెన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పచ్చదనం అభివృద్ధితో పాటు, అందమైన పూల మొక్కలను ఏర్పాటు చేయాలని సూచించారు. శుక్ర, శనివారాల్లో విజయనగరం జిల్లా పాండ్రంగిలో అల్లూరి సీతారామరాజు తల్లిదండ్రుల ఇంటి పునరుద్ధరణ, చింతపల్లిలో అల్లూరి సీతారామన్ రాజు జైలులో ఉన్న పోలీస్ స్టేషన్ పునరుద్ధరణ పనులను తనిఖీ చేయనున్నట్లు ఉమా నండూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ సేవాసమితి సభ్యులు విశ్వనాథ రాజు, కంతేటి వెంకటరాజు, సీహెచ్ కృష్ణంరాజు, సుబ్బరాజు, నాని రాజు, రఘురామరాజు, సీహెచ్ ఝాన్సీ లక్ష్మి, ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, తదితరులు ఉన్నారు.

సౌత్‌జోన్ చెస్ పోటీలకు సెయింట్ జోసెఫ్ విద్యార్థి

పెదవేగి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో జనవరి నెల 8 నుంచి జరిగే సౌత్‌జోన్ చెస్ పోటీలకు సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల విదార్థి ఎ.రత్నాకర్ ఎంపికయ్యాడు. కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ గురువారం వివరాలు తెలిపారు. విశ్వ విద్యాలయ స్థాయి చెస్ పోటీల్లో రత్నాకర్ సౌత్‌జోన్ పోటీలకు అర్హత సాధించాడని ఆయన చెప్పారు. ఏవో ఫాదర్ ఫెలిక్స్, వైస్ ప్రిన్సిపాల్ అరుణ్, పీడీ ఎన్.నల్లయ్య రత్నాకర్‌ను అభినందించారు. సౌత్‌జోన్ పోటీల్లో పతకం సాధించి కళాశాల ఖ్యాతిని పెంచాలని వారన్నారు.



ఇరుముడులు సమర్పిస్తున్న పెద్దింటి అమ్మవారి దీక్షాధారులు

పెద్దింటి అమ్మవారి దీక్షల విరమణ

కైకలూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి దీక్ష చేపట్టిన భక్తులు గురువారం ప్రత్యేక పూజల అనంతరం దీక్ష విరమించారు. గురువారం అమ్మవారి ఆలయంలో మాలధారణ విరమణ సందర్భంగా పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పేటేటి పరమేశ్వరరావు, పూజలు చేసి ఇరుముడుల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 60 మంది భక్తులు దీక్ష విరమించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హరి.. హరి..

మోటార్ సైకిల్‌పై హరిదాసు



ధనుర్మాసంలో సూర్యోదయానికి ముందే హరిలో రంగహరి.. అంటూ చేతిలో చిడతలు, తంబుర వాయిస్తూ తలపై అక్షయపాత్రతో ప్రత్యక్షమవుతారు హరిదాసులు. పల్లె, పట్టణాలు తేడా లేకుండా తెల్లవారుజామునే ముంగిట ముగ్గులేస్తుండగా వీధుల్లో కీర్తనలను ఆలపిస్తూ అలరించేవారు. వచ్చినంత వేగంగా వెళ్లిపోతారు. హరిదాసు వచ్చేసరికి కానుక ఇవ్వడానికి సిద్ధంగా ఉండాల్సిందే. ప్రస్తుత హరిదాసు కూడా వేగంగా వస్తున్నాడు. మోటార్ సైకిల్‌పై కీర్తనలు ఆలపించడు.. మైక్ పాడుతుంది..!

- అత్తిలి, ఆంధ్రజ్యోతి



అత్తిలిలో మోపెడ్‌పై హరిదాసు

పాపాలు తొలగుతాయని..

సంక్రాంతికి ముందు అంటే ధనుర్మాసంలో హరిదాసులు వీధుల్లో శ్రీమద్రామణ రమణా గోవిందో హరి అంటూ ఇంటి ముందు ముగ్గుల చుట్టూ ఒకసారి తిరుగుతారు. హరిదాసును వేకువజామునే దర్శిస్తే పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఉట్టి చేతులతో ఆయనను పంపరు. తుంబుర గానం వినిపించగానే గృహిణులు స్వయంపాకాలతో సిద్ధంగా ఉంటారు.

హరిదాసుల రామ గానం

ఏడాది అంతా వేర్వేరు పనుల్లో నిమగ్నమయ్యే హరిదాసులు ధనుర్మాసంలో తప్పకుండా రామ గానం చేస్తారు. సొంత ఊళ్ల నుంచి ఇతర ఊళ్లకు వెళతారు. గ్రామ వీధుల్లో భజనలు చేస్తారు. ప్రతి ఇంటి ముందు కూర్చుని లేవడం కష్టమైనా భక్తిభావంతో అదంతా మర్చిపోతారు. వంశపారంపర్యంగా అనేక మంది దశాబ్దాలుగా రామ నామ స్మరణ చేస్తున్నారు. సంక్రాంతి ముగిసిన తర్వాత సొంత ఊళ్లకు వెళ్లిన హరిదాసులు పొలం పనులు, కూలి పనులతో జీవనం సాగిస్తారు.

దీవెనలు ఇచ్చే హరిదాసు

దానధర్మాలు అందుకుని ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు కలగాలని దీవించే వారే హరి దాసులు. నెల రోజులు పాటు హరి నామ గానం చేసినందుకు చివరి రోజున ఇచ్చే ధనధాన్యాలను, వస్త్రాలను స్వీకరిస్తారు. వీరి వస్త్రధారణ ప్రత్యేకంగా ఉంటుంది. పట్టుధోవతి కట్టి పట్టు కండువా నడుము చుట్టి మెడలో ఒక పూలహారం ధరించి చక్కగా తిలకం దిద్దుకుంటారు. సూర్యభగవానుడు ప్రసాదించిన అక్షయ పాత్రను శిరస్సుపై పంచలోహపాత్ర ధరిస్తారు. తెల్లవారకముందే ఈ అలంకరణ పూర్తి చేస్తారు. గోదాదేవిని స్మరించి తిరుప్పావై పఠించి వీధుల్లోకి వెళతారు. తిరిగి ఇంటికి వెళ్లే వరకు హరినామ సంకీర్తన తప్ప ఏమీ మాట్లాడరు. తలపై అక్షయ పాత్రను కిందికి దించరు. ఇల్లు చేరిన తర్వాత ఆ ఇంటి ఇల్లాలు అడడి పాదాల ను కడిగి అక్షయపాత్రను దించుతుంది. ధనుర్మాసం అంతా నిష్ఠగా ఉంటారు హరిదాసులు.

> శ్రీరాముడి రాజ్యంలో చింతలు లేవు. కరువు కాటకాలు లేవు. దానధర్మాలు చేద్దామన్నా పుచ్చుకునేవారే లేరని ప్రజలు ధర్మదేవతను ఆడిపోసుకునేవారట. అది విన్న వేగులు రాముడి తో చెప్పగా వారి ధానధర్మాలను పుచ్చుకునేం దుకు హరినామ గాయకులను రాజ్యంలో తిరుగాడేలా చేశారని.. వారే నేడు కన్పించే హరిదాసులని చెబుతుంటారు.



మొగల్తూరులో బైక్‌పై యువ హరిదాసు

సంప్రదాయం కొనసాగించేందుకే..

శ్రీరామవరంగా ఈ దీక్షను స్వీకరిస్తాం. ఉదయం 4 గంటల నుంచే పొగమంచులో ప్రయాణం ప్రారంభిస్తాం. చివరి రోజు స్వయం పాకంతో వందలు, వేల రూపాయలు ఇచ్చేవారు. ఇప్పుడు ఆదరణ తగ్గిపోయింది. దానం ఇచ్చేవారు తగ్గిపోయారు. ఈ కళలోకి రావడానికి తర్వాతి తరం ఆసక్తే చూపడడం లేదు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగించాలన్నదే మా తాపత్రయం.

టి.రామాంజనేయులు
యనమదల, బాపట్ల జిల్లా

హైటెక్ హరిదాసులు

● ఆచంట / మొగల్తూరు: ధనుర్మాసం ప్రారంభమైన తర్వాత నెల రోజులు హరిదాసులు వేకువజామునే గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సందడి చేసేవారు. ప్రస్తుతం ఎక్కువ మంది వయసు పైబడిన హరిదాసులే. కీళ్ల నొప్పులు తదితర అనారోగ్య సమస్యలతో మోటారు సైకిల్ ఎక్కారు.

కొత్త తరం హరిదాసు కాళ్లకు గజ్జె కడుతున్నా.. చేతిలో మాత్రం బైక్ హేండిల్ ఉంటుంది. హరి నామ గానం మాత్రం మనసు లోనే.. పైకి మైక్ వినిపిస్తుంది. నెత్తిపై అక్షయ పాత్ర మోటార్ బైక్ ముందు భాగంలో కనిపిస్తుంది. మోటారు సైకిల్‌ను సంప్రదాయం పద్ధతిగా అలంకరించడం ప్రత్యేకత. మోటారు సైకిల్‌కు అక్షయ పాత్రను ప్రత్యేకంగా అలంకరించి మైక్‌లో హరినామ సంకీర్తనను రికార్డ్ వేసి ఇంటింటికి వెళుతున్నారు. కాలినడకన వచ్చే హరిదాసులు అక్కడక్కడ మాత్రమే కనిపిస్తున్నారు. మొగల్తూరు పంచాయతీ కుక్కల వారితోటలో హరిదాసు టీవీఎస్ స్కూటర్‌పై రావడంతో చిన్నారులు, గ్రామస్థులు మొదట వింతగా చూశారు. తర్వాత రోజూ బియ్యం, స్వయంపాకం సమర్పిస్తున్నారు.

ఆచంట మండలం కరుగోరుమిల్లికి చెందిన జాజుల హనుమంతు పూర్వీకులందరూ హరిదాసులుగా జీవించారు. సంప్రదాయం మరవకుండా తాను మోటారు సైకిల్‌పై పలు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతున్నట్లు తెలిపారు.



ఆచంటలో బైక్‌పై హరిదాసు

ద్వారకాతిరుమల ఆలయ ఇన్‌చార్జి ఈవోగా త్రినాథరావు



ద్వారకాతిరుమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వేండ్ర త్రినాథరావు నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ గురువారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఇక్కడ దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న ఎన్వీ సత్యనారాయణ మూర్తి అనారోగ్యం కారణంగా నెల రోజులు సెలవు పెట్టారు. దీనితో సింహాచలం ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావును ఇన్‌చార్జిగా పూర్తి బాధ్యతలతో నియమించారు. గత సెప్టెంబరు వరకు ఇక్కడ ఈవోగా పనిచేసిన త్రినాథరావు సాధారణ బదిలీల్లో సింహాచలం ఆలయానికి వెళ్లారు. టీటీడీ ఆర్‌జేసీ ఎన్వీ సత్యనారాయణమూర్తి ఇక్కడికి వచ్చారు. ద్వారకాతిరుమల ఇన్‌చార్జి ఈవోగా త్రినాథరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు.



కనువిందైన...ధనుర్మాస ఉత్సవం

ద్వారకాతిరుమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ధనుర్మాస ఉత్సవం వైభవంగా జరిగింది. గురువారం ఉదయం స్వామివారు, ఉభయ దేవేరులు, గోదాదేవితో కలసి తొళక్క వాహనంపై ఊరేగారు. ఆలయ ఆవరణలో శ్రీవారు, అమ్మవార్లతో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను వాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం గజ, అశ్వ సేవలతో పాటు మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ధనుర్మాస మండపంలో గోదాదేవి, అమ్మవార్లను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

క్షేత్ర పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

నేడు ఉమ్మడి పశ్చిమ మత్స్యకార సొసైటీ ఎన్నిక

నరసాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్యకార సహకార సంఘం ఎన్నికలు శుక్రవారం ఏలూరులోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో జరగనున్నాయి. దీనికి జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉమ్మడి పశ్చిమలో 137 సంఘాలు ఓటు హక్కును వినియోగించుకోనున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఐదుగురు అభ్యర్థులు అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు అంద్రాజు చల్లారావు కూడా బరిలో ఉన్నారు. ఆయనకు పోటీగా నరసాపురం నుంచి కూటమి అభ్యర్థిగా మైలా వసంతరావు నిలిచారు. ఇటు ఉంగుటూరు, అటు మెట్టప్రాంతం నుంచి కూటమి తరుపున మరో ముగ్గురు రంగంలో ఉన్నారు. ఈనేపథ్యంలో కూటమి పార్టీ ఏవరికీ మద్దతు ఇస్తుందోనన్నది ఇంత వరకు తెలలేదు. షెడ్యూల్ ప్రకారం గత నెలలో ఎన్నికలు జరిగాల్సి ఉంది. అయితే చివరి నిమిషంలో వాయిదా పడ్డాయి. ఈనేపథ్యంలో ఈసారి ఎన్నికలు ఉత్కంఠంగా మారాయి. బాదంపూడి ఎఫ్‌డీవో కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎన్నికలు జరగనున్నాయి.

సీపీఐ కార్యాలయం కూల్చివేత



బుట్టాయగూడెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం మండల కేంద్రం రెడ్డిగణపవరం రూట్‌లో నూతనంగా నిర్మించిన సీపీఐ కార్యాలయ భవనాన్ని గురువారం సాయంత్రం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. నూతనంగా నిర్మించిన ఈ కార్యాలయాన్ని ఈ నెల 27న ప్రారంభించేందుకు నాయకులు అన్ని సిద్ధం చేస్తున్నారు. కార్యాలయం ప్రారంభం సందర్భంగా భారీ బహిరంగ సభను కూడా నిర్వహించడానికి నాయకులు సిద్ధపడుతున్న తరుణంలో మండల రెవెన్యూ అధికారులు కార్యాలయాన్ని కూల్చివేడంపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. సీపీఐ నాయకుల వాదనలతో రెవెన్యూ అధికారులు ఏకీభవించడంలేదు. కార్యాలయం నిర్మించిన స్థలం ప్రభుత్వానిది అని రెవెన్యూ అధికారులు చెబుతుండగా ఈ స్థలం గతం నుంచి సీపీఐదే అంటూ నాయకులు స్పష్టం చేస్తున్నారు. ఇదంతా నాలుగు సెంట్లు ప్రభుత్వం స్థలంగా అధికారులు చెబుతున్నారు. ఇందులో రెండున్నర సెంట్లు ఆక్రమించినట్టుగా అధికారులు తెలిపారు. ఈ స్థలం విషయమై వివాదం నడుస్తుంది. కార్యాలయాన్ని కూల్చివేసే ముందు అధికారులు నోటీసులు కూడా ఇవ్వకపోవడంపై సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాన్ని కూల్చివేయడాన్ని నిరసిస్తు శుక్రవారం రెవెన్యూ, పోలీసు కార్యాలయాలు ఎదుట ఆందోళనలకు సిద్ధపడుతున్నట్లు తెలిపారు.

నేడు ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ ఏలూరు రాక

వర్గీకరణ అనుకూల, వ్యతిరేక వర్గాల నుంచి వినతుల స్వీకరణ

ఏలూరు టూటౌన్/ఏలూరు క్రైం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాలోని ఉప వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రా ఈనెల 27వ తేదీన జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లోని గోదావరి మీటింగు హాలులో ఉదయం 11 గంటలకు హాజరై ఎస్సీ వర్గీకరణకు అనుకూలం, వ్యతిరేక వాదనలను ఎస్సీలోని ఉపకులాల నాయకులు, సంఘాల నుంచి వ్యక్తిగతంగా వినతిపత్రాల రూపంలో స్వీకరించనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో, విద్యాసంస్థల్లో షెడ్యూల్ కులాల ఉపవర్గాల ప్రాతినిధ్యానికి సంబంధించిన వినతులు పరిశీలిస్తారు. ఉపకులాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా వెనుకబాటుతనాన్ని పరిశీలిస్తారు. వినతులులు అందించే ప్రజలు ఓరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో 11గంటల నుంచి 2గంటల లోపు హాజరుకావాలన్నారు.

పోలీసుల భారీ బందోబస్తు

ఏకసభ్య కమిషనర్ రాజీవ్‌రంజన్ పర్యటన నేపథ్యంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో త్రీటౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 300 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్ చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు ఫైర్‌స్టేషన్ వరకు, ముందస్తు చర్యగా నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



కార్యకర్త మృతి.. పాడె మోసిన ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు పంది సోమరాజు మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. సాగిపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత పంది సోమరాజు (70) గురువారం ఉదయం స్వగృహంలో గుండెపోటు చనిపోయారు. టీడీపీ ఆవిర్భావం నుంచి అన్న ఎన్‌టీఆర్ స్ఫూర్తితో పార్టీ కోసం క్రియాశీలకంగా పనిచేసి పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా, బీసీ నేతగా పని చేశారన్నారు. సోమరాజు మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంటనే సాగిపాడు చేరుకుని మృతదేహానికి పార్టీ జెండాకప్పి నివాళులర్పించి పాడెమోశారు.

పోటీ పరీక్షల అభ్యర్థులు ప్లానింగ్ చేసుకోవాలి

భీమవరం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పోటి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు చక్కని ప్లానింగ్‌తో చదవాలని పోటీ పరీక్షల శిక్షకుడు రఫీ సూచించారు. డాక్టర్ వైఎస్ఆర్ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షపై అవగాహన సదస్సులో ఆయన అవగాహన కల్పించారు. ప్రతి అభ్యర్థి అకాడమీ పుస్తకాలతోపాటు, దినపత్రికలను తప్పనిసరిగా చదవాలని, విజయ సాధనకు అవసరమైన సులభపద్ధతిని వివరించారు. ఏయే అంశాల్లో ఎక్కువ ప్రశ్నలు ఇచ్చే అవకాశం ఉందో తెలిపారు. ఎక్కువ పుస్తకాలు చదవద్దని, ఒకపుస్తకాన్నే ఎక్కువ సార్లు రివిజన్ చేయ్యాలన్నారు.ఆంధ్రప్రదేశ్ చరిత్ర గురుంచి చెప్తూ రాజుల పేర్లు బట్టీ కాక ఆయా రాజుల సంఘటనలను బట్టి చదవాలి అని అన్నారు

ఫ్యాక్టరీ వద్ద ఆందోళనకు కారుమూరి మద్దతు



తణుకు రూరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, పర్యావరణానికి ఇబ్బందికరంగా వున్న లేహం ఫుడ్ ఫ్యాక్టరీని మూసేయాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తేతలి గ్రామంలో లేహం ఫుడ్ ఫ్యాక్టరీని మూసేయాలని కోరుతూ స్థానికులు, గో సంరక్షణ ప్రతినిధులు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ ముందు చేపట్టిన వంటా వార్పు నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి కారుమూరి పాల్గొని సంఘీభావం తెలిపారు. రామరాజ్య స్థాపన వ్యవస్థాపకులు కె.వీర రాఘవరెడ్డి మాట్లాడుతూ పాడి పశువులను వధించడం ద్వారా పర్యావరణానికి తీరని నష్టం జరుగుతుందన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రిపుల్ ఐటీకి విద్యుత్ అంతరాయం

ఉదయం పరీక్ష మధ్యాహ్నానికి వాయిదా

వేంపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. బుధవారం అర్ధరాత్రి 1.30గంటల ప్రాంతంలో సరఫరా నిలిచిపోగా గురువారం ఉదయం 10గంటల సమయంలో విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీంతో రాత్రంతా విద్యార్థులు, అధ్యాపకులు, అక్కడి క్వార్టర్స్‌లో నివాసముంటున్న సిబ్బంది అవస్థలు పడ్డారు. విద్యుత్ లైన్‌లో డిస్క్ సమస్య, ట్రిపుల్‌ఐటీలో విద్యుత్ సరఫరా అయ్యే గదిలోని ప్యానల్స్‌లో బల్బులు ఉండడం వల్ల కరెంటు నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది హుటాహుటిన తనిఖీలు నిర్వహించి సమస్యలు పరిష్కరించి సరఫరా పునరుద్ధరించారు. కాగా.. విద్యుత్ లేని కారణంగా గురువారం ఉదయం పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు జరగాల్సిన ఫిజిక్స్ పరీక్షను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ఇడుపులపాయలో అంతరాయం వల్ల రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లోను ఫిజిక్స్ పరీక్షను ఉదయం వాయిదా వేసి మధ్యాహ్నం నిర్వహించామని ట్రిపుల్‌ఐటీ పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్ తెలిపారు.

విద్యుత్ సమస్యపై రైతుల ఆందోళన

ముసునూరు, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): వ్యవసాయ విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని చింతల వల్లికి చెందిన రైతులు సబ్‌స్టేషన్ గేటు మూసి వేసి గురువారం ఆందోళన చేశారు. నాలుగు రోజుల నుంచి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలకు నీరు అందించలేక పోతున్నామని, వేలాది రూపాయలు కౌలు కట్టి వ్యవసాయం చేస్తున్నామని సకాలంలో పంటలకు నీరు పెట్టకపోతే పంట ఎలా పండుతుందని కౌలు రైతు మందపాటి కిషోర్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. లైన్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు రైతులతో మాట్లాడి, సమస్యను వెంటనే పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.



ఉద్దరాజు రామం జీవిత విశేషాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఉద్యమాల శిఖరం ఉద్దరాజు రామం

పుష్కకావిష్కరణలో బీవీ రాఘవులు, బేబి

నరసాపురం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణా ప్రాంతం నుంచి ఉద్యమకారునిగా ఎదిగిన ఉద్దరాజురామం ఉద్యమ శిఖరం లాంటివారని పలువురు వక్తలు కీర్తించారు. గురువారం రాత్రి అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో ఉద్దరాజు జీవిత విశేషాలతో కూడిన పుస్తకాన్ని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, బేబి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. రాఘవులు మాట్లాడుతూ దేశభక్తుడిగా అత్యంత సామాన్య జీవితాన్ని గడిపిన రామం బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించారన్నారు. అనేక ఏళ్ల జైలు జీవితం కూడా రామం అనుభవించారన్నారు. రైతుల్ని, సామాన్య ప్రజల్ని అనేక పోరాటాల వైపు నడిపించిన ఘనత రామంది అన్నారు. మరో పొలిట్ బ్యూరో సభ్యులు బేబి మాట్లాడుతూ కేరళలో ప్రజాస్వామ్యబద్దంగా ఏర్పడిన నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసినప్పుడు అప్పటి పార్లమెంట్‌లో గొంతెత్తి నిలదీసిన నాయకుడు రామం అన్నారు. కార్యక్రమంలో రామదేవి, ఉద్దరాజు బాపీరాజు, వర్మ, బలరాం, కవురు పెద్దిరాజు, ఎం త్రిమూర్తులు, బాబూరావు, పురేళ్ళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తొలిరోజు కీలక అంశాలపై చర్చ..

సీపీఎం రాష్ట్ర మహాసభల్లో భాగంగా తొలి రోజున కేంద్ర, రాష్ట్రాల్లో నెలకొన్న రాజకీయ, ప్రజాసమస్యలపై కీలకంగా చర్చించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను శుక్రవారం విలేకర్లకు వెల్లడించనున్నారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షతన కమిటీ సమావేశంలో బీవీ రాఘవులు, బేబి, కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం, రామదేవి, వై వెంకటేశ్వరావు, సురేంద్ర, లోకనాథం, తులసీదాస్ పాల్గొన్నారు.



ముత్యాలపల్లిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సెలవు ఇవ్వలేదని ఉపాధ్యాయుల నిరసన

మొగల్తూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు లోకల్ హాలిడే ఇచ్చేందుకు డీఈవో అనుమతించని కారణంగా జాక్టో ఆధ్వర్యంలో గురువారం ముత్యాలపల్లిలో ఉపాధ్యాయులు ఆందోళన నిర్వహించారు. స్థానిక అవసరాలు, పరిస్థితుల దృష్ట్యా హెచ్‌ఎంలు పాఠశాలకు సెలవు ప్రకటించే వేసులు బాటు ఉన్నప్పటికి గురువారం ఎల్‌హెచ్‌కు డీఈవో, ఉన్నతాధికారులు అనుమంతించని కారణంగా ఉపాధ్యాయులు నిరసన తెలిపినట్టు జాక్టో ఉపాధ్యాయ సంఘం తెలిపింది.

నరసాపురం రూరల్: పట్టణ, మండలంలోని ఉపాధ్యాయులు గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. క్రిస్మస్ పురస్కరించుకుని 26న కూడా ఉద్యోగులకు ఆప్షన్ హాలిడే ఇవ్వాల్సి ఉంది. అయితే విద్యాశాఖ దీన్ని రద్దు చేసింది. ఈచర్యను నిరసిస్తూ ఉపాధ్యాయులు నిరసనకు దిగారు.

సమగ్రశిక్ష ఏపీసీగా పంకజ్‌కుమార్ బాధ్యతల స్వీకారం



ఏలూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): సమగ్రశిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ (ఏపీసీ)గా నియమి తులైన డాక్టర్ కురెళ్ళ పంకజ్ కుమార్ గురువారం ఏలూరులోని జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో విధుల్లో చేరారు. కైకలూరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఆంగ్ల విభాగం ప్రొఫెసర్‌గా ఉంటూ, డిప్యూటే షన్‌పై పాలకొల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ఈయనను ఫారిన్ సర్వీసులో డిప్యూటేషన్‌పై సమగ్రశిక్ష జిల్లా ఏపీసీగా కొద్ది రోజుల క్రితం నియమించిన విషయం విదితమే. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఏపీసీగా డీఈవో వెంకటలక్ష్మమ్మ వ్యవ హరిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనం తరం అధికారులతో ఏపీసీ సమావేశమయ్యారు.

క్రైమ్ కార్నర్

విద్యుత్ ప్రమాదంలో వ్యక్తి మృతి

టినరసాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లివారిగూడెం గ్రామానికి చెందిన యతిరాజు ముత్తయ్య (34) భార్య చుక్కమ్మలు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 24న ముత్తయ్య గ్రామానికి దగ్గర్లో ఉన్న అడవికి ఆనుకుని ఉన్న పామాయిల్ తోటలో అడవి పందుల వేట నిమిత్తం కరెంట్ తీగలు మార్చడానికి వెళ్ళాడు. ఈ క్రమంలో ప్రమాద వశాత్తు విద్యుత్ తీగలకు తగిలి మృతి చెంది నట్లు భార్య చుక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు.

మృతుడి ఆచూకి లభ్యం

అత్తిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇరగవరం మండలం రేలంగి రైల్వే గేటు సమీపంలో ఇటీవల రైలు నుంచి జారిపడి మృతి చెందిన ఘటనలో మృతుడి ఆచూకీ లభ్యమైనట్లు భీమవరం రైల్వే పోలీసులు తెలి పారు. మృతుడు అత్తిలి మండలం గుమ్మంపాడు గ్రామానికి చెందిన గుండే రాజశేఖర్ అలియాస్ చిన్నా (34)గా గుర్తించినట్లు చెప్పా రు. ఈనెల 22 రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్ళిన రాజశేఖర్ తిరిగి రాలేదు. అయితే విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లుగా భీమ వరం రైల్వే పోలీసులు భావిస్తున్నారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా భావించిన పోలీసులు మృతదేహాన్ని తణుకు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. భీమవరం రైల్వే ఎస్ఐ పీటీవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రిస్తున్న వ్యక్తి మీదకు ఎక్కిన వాహనం

చింతలపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండలం వెంకటాద్రిగూడెం గ్రామానికి చెందిన నాగ శ్రీనివాసరావు(50) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల్లో ఆయన ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి నైట్ డ్యూటీ చేస్తూ నిద్రిస్తున్న సమయంలో వెనుక నుంచి వాహనం ఎక్కడంతో ప్రమాద వశాత్తు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై బంధువులు, గ్రామస్తులు చింతలపూడిలో కుటుంబానికి న్యాయం చేయాలంటూ ధర్నా జరిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ రవీంద్రనాయక్, ఎస్ఐ కుటుంబరావు వచ్చి ధర్నాను విరమింప చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

కిరాణాషాపులకు టోకరా

నిందితుడు ఏలూరులో స్కూటర్‌పై సంచారం



నిందితుడు

ఏలూరు క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నెంబర్‌లేని స్కూటర్ వేసుకువస్తాడు. సీసీ కెమెరాలు ఉంటే దానికి చిక్కుపడిపోతానని ముందుగానే భావించి క్యాప్ పెట్టి తన ముఖాన్ని కెమెరా గుర్తు పట్టకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుని కిరాణాషాపుల వారిని మోసాలు చేస్తున్నాడు. గురువారం ఏకంగా షాపుల వ్యాపారులకు లక్ష రూపాయల వరకు టోకరా పెట్టాడు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం ఏలూరు వన్‌టౌన్ వైఎంహెచ్ఏ హాలు సమీపంలో శ్రీ కృష్ణా సాయిరైస్ ఆయిల్ అండ్ జనరల్ మర్చంట్ షాపు యజమాని గార్లపాటి నాగరాజు పనిమీద బయటకు వెళ్ళారు. ఆ సమయంలో ఆయన సతీమణి విజయలక్ష్మి షాపులో ఉన్నారు. మధ్యా హ్నం ఒక వ్యక్తి స్కూటర్ వేసుకుని వచ్చాడు. దానికి నెంబర్ ప్లేటు లేదు. తనది సత్రంపాడు అని చెప్పి బస్తా కందిపప్పు, బస్తా మినపగుళ్ళు తీసుకున్నాడు. ఆ బస్తాలను తన స్కూటర్‌కు కట్టుకున్నాడు. మొత్తం 13 వేల 500 రూపాయలు బిల్లు అవ్వగా అక్కడ ఉన్న స్కానర్‌కు ఫోన్‌పే చేసినట్లుగా నటించాడు. అది అవ్వలేదని తన తండ్రి చేత ఫోన్‌పే చేయిస్తున్నానంటూ నెంబర్ తీసుకున్నాడు. ఆ తరువాత జి నాగరాజు అనే పేరుతో ఫోన్ పే అయిపోయిందని స్క్రీన్ షార్ట్ ఆమెకు చూపించాడు. అయితే ఆ స్కీన్ షార్ట్‌లో జి నాగరాజు అని ఉండడంతో తన భర్త తో మాట్లాడి నిర్ధారణ చేసుకుంటా నని చెప్పేలోపే అక్కడ నుంచి వడివడిగా స్కూటర్‌ను స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు. తన భర్తను అడగగా ఎలాంటి ఫోన్‌పే రాలేదని చెప్పాడు. అయితే సత్రంపాడు అని చెప్పడంతో ఆ ప్రాంతానికి వెళ్ళి విచారణ చేయగా ఈ వ్యక్తి నగరంలో చాలా షాపుల వద్ద ఇదే విధంగా చేస్తున్నట్లు చెప్పారు. గురువారం వన్‌టౌన్‌లోని ఐదు షాపుల వారిని ఇదే విధంగా చేసి లక్ష రూపాయల వరకూ టోకరా పెట్టాడని చెప్తున్నా రు. పోలీసులు నిఘా పెంచి ఇతనిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఫేక్ కరెన్సీ పేరిట బురిడీ

రంగంలోకి పోలీసులు.. ఇద్దరిని విచారిస్తున్న పోలీసులు.. ఒకరి పరారీ

ద్వారకాతిరుమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అసలైన కరెన్సీకి మారుగా ఫేక్ కరెన్సీని అదికంగా ఇస్తామని నమ్మబలికిన ఇద్దరు యువకులు చివరకు బొమ్మ(టాయ్) కరెన్సీని ఇచ్చి ద్వారకాతిరుమలకు చెందిన ఓ వ్యాపారిని బురిడీ కొట్టించారు. వివరాల్లోకి వెళితే... ద్వారకాతిరుమలకు చెందిన సుభాష్ అనే వ్యాపారి వద్దకు గురువారం జంగారెడ్డిగూడెంకు చెందిన ఇద్దరు యువకులు వచ్చి రూ2.50లక్షలు అసలు కరెన్సీని తమకు ఇస్తే తాము రూ.15లక్షలు నకిలీ కరెన్సీ ఇస్తామని చెప్పారు. దీన్ని నమ్మిన సుభాష్ డబ్బును సిద్ధం చేసి ఆ యువకులు స్థానిక యాదవ కాలనీ వద్దకు రాగా అసలు కరెన్సీ సుభాష్ వారికిచ్చాడు. వారు తనకు ఇచ్చిన బ్యాగ్‌ను తెరచి చూడగా అందులో నకిలీ నోట్లకు బదులుగా బొమ్మ కరెన్సీనోట్లను గమనించాడు. దీంతో ఆగ్రహావేశాలకు గురైన సుభాష్ తాను ఇచ్చిన నగదును ఆ యువకుల వద్ద నుంచి లాక్కున్నాడు. ఈ సమయంలో యువకులు, సుభాష్ మధ్య ఘర్షణ జరిగింది. ఆతరావ్త సుభాష్ తన సొమ్మును తీసుకుని అక్కడి నుంచి వెళ్లి పోయాడు. స్థానికులు యువకులను పట్టుకునేందుకు ప్రయత్నించగా బొమ్మ కరెన్సీ ఇచ్చిన ఒకడు పారిపోగా మరొకరిని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ సుధీర్ సదరు యువకునితో పాటు సుభాష్‌ను విచారిస్తున్నారు.

ఏలూరు జిల్లాలో పోలీసు తనిఖీలు

ఏలూరు క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నేరాల నియంత్రణ కోసం పోలీసు లు రాత్రి వేళ విస్తృతంగా తనిఖీలు నిర్వహి ంచారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధి లోని పోలీసులు బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకూ నిర్వహిం చారు. పలు ప్రాంతాల్లో వాహన డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి ఫేస్‌వాష్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో ఎవ్వరు మద్యం తాగకుండా కట్టడి చేశారు. బస్టాప్‌ల వద్ద వంటరి మహిళలకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక బృందాలు గస్తీలు నిర్వ హించారు. నేరస్తులపై నిఘా పెట్టి లాడ్జీలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు తనిఖీలు చేసి అనుమానిత వ్యక్తులను ప్రశ్నించారు.

ఎక్సైజ్ దాడులు

మహిళకు రూ.75 వేల జరిమానా

చింతలపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఎన్ ఫోర్స్‌మెంట్ అధికారులు, స్థానిక అధికారులు దాడులు నిర్వహించారు. నాగిరెడ్డిగూడెం గ్రా మానికి చెందిన భూక్యా బుజ్జి అనే మహిళ పాత నాటుసారా కేసులో నిందితురాలు. గతం లో బైండోవర్ చేయగా తిరిగి సారా కేసులో పట్టుపడగా తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయగా బైండోవర్‌ను ఉల్లంఘించినందుకు 75 వేల రూపాయలు అపరాధ రుసుము చెల్లించాలని జరిమానా విధించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు. ఆమె వద్ద నుండి ఐదు లీటర్ల సారా కూడా స్వాధీనం చేసుకు న్నారు. బంధంచర్ల, నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో జరిగిన దాడుల్లో 1900 లీటర్ల బెల్లపు ఊటను కనుగొని ధ్వంసం చేయడం జరిగిందన్నారు. రాచప్రోలు అరుణ్‌పై పరారీ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అనుమానాస్పద మృతి

భీమవరం క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఒక యువకుడు మృతి చెందిన సంఘటన భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం పంచాయతీ వెల్లటూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. భీమవరం రూరల్ ఎస్ఐ వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం పట్టణానికి చెందిన అమరపల్లి శివాజీ (25) కొద్ది కాలం క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఒక కుమారుడు కూడా జన్మించాడు. అయితే భార్య ప్రోద్బలంతో ఇల్లరికం వెళ్ళాడు. భార్య ప్రస్తుతం ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్ళడంతో అత్తమామల వద్ద ఉంటున్నాడు. అయితే గురువారం మధ్యాహ్నం అతను ఉంటున్న ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. దీనిపై తల్లి రత్నకుమారి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీర్రాజు తెలిపారు. అనుమానాస్పదంగా ఒక వ్యక్తి ఇంట్లో మంచంపై పడి మృతి చెందిన సంఘటన భీమవరం నర్సయ్య అగ్రహారంలో గురువారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మెంటేవారితోటకు చెందిన చాగంటి శ్రీనివాస్ కుమారుడు మధుబాబు (36)కు పది సంవత్సరాల క్రితం నర్సయ్య అగ్రహారానికి చెందిన ఒక మహిళతో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు సంతానం. అయితే ఏడేళ్ళ క్రితం భార్య పిల్లలతో అత్తారింటికి కాపురానికి వెళ్ళాడు. గురువారం ఉదయం శ్రీనివాస్‌కు కోడలు ఫోన్ చేసి మధుబాబుకు అనారోగ్యంగా ఉందని, మంచంపై పడి ఉన్నాడని, ఎంత పిలిచినా పలకడం లేదంటూ తెలిపింది. దీంతో శ్రీనివాస్ అక్కడకు వెళ్ళి 108 ద్వారా భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళగా డాక్టర్ పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లుగా తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నగ్న దొంగ అరెస్టు

దుస్తులు లేకుండా చోరీలు.. రూ.26 లక్షల బంగారం ఆభరణాలు, రూ.లక్ష నగదు స్వాధీనం



విజయవాడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి):రాత్రిపూట ఒంటిపై దుస్తులు లేకుండా తిరుగుతున్న నగ్న దొంగ దొరికాడు. ఈ వివరాలను విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, క్రైమ్స్ డీసీపీ టి.తిరుమలేశ్వరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావుతో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం వెల్లడించారు. గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన కంచర్ల మోహనరావు ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. తల్లిదండ్రులు లేకపోవడంతో చిన్నతనంలోనే దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. వివిధ నేరాల్లో జైలుకు వెళ్లి రావడంతో తర్వాత కరుడుగట్టిన నేరగాడిగా మారిపోయాడు. ప్రస్తుతం కాకినాడ జిల్లా తుని మండలం మరువాడలో భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. అక్కడి నుంచి చోరీలకు బయలుదేరతాడు. గంజాయి, మద్యం తాగడానికి బానిసగా మారాడు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో అక్టోబరు పదో తేదీన ఎంఎస్ అపార్ట్‌మెంట్‌లో ఉన్న కుటుంబం రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రపోయింది. ఉదయం నిద్ర లేచి చూసే సరికి కిటికీ నుంచి ప్రధాన ద్వారం తలుపు గడియను తీసి లోపలకు ప్రవేశించాడు. కప్‌బోర్డులో ఉన్న బంగారు ఆభరణాలు దొంగిలించాడు. అపార్టుమెంట్‌కు వెనుక వైపు ఉన్న ఇంట్లో తాళాలు పగలుగొట్టి చోరీ చేశాడు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తును సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ చేపట్టారు. రాజమండ్రిలోని దివాన్‌చెరువు వద్ద కాపుగాచి ఎస్.కోట బస్సును తనిఖీ చేయగా మోహనరావు ముఖానికి మాస్క్ ధరించి ఒక మూలన కూర్చున్నట్టు గుర్తించారు. అతడ్ని అక్కడి నుంచి విజయవాడకు తీసుకొచ్చి విచారించగా నేరాల చిట్టా వెలుగులోకి వచ్చింది.

వంటిపై దుస్తుల్లేకుండా చోరీలు

మోహనరావు ఎక్కడ చోరీలు చేయాలనుకున్నా ఒంటరిగా వెళ్తాడు. నేరం చేయాలనుకున్న ప్రదేశంలో రెండు, మూడు రెక్కీలు నిర్వహిస్తాడు. ఇంట్లో మనుషులు ఉన్నా, లేకపోయినా చోరీ చేయాలని నిర్ణయించుకున్న తర్వాత దాన్ని నెరవేర్చుకుంటాడు. చోరీ చేయాలనుకున్న ఇంటికి పక్కనే ఖాళీ స్థలం ఉంటేనే దాన్ని ఎంచుకుంటాడు. దొంగతనం చేయడానికి బయలుదేరినప్పుడు ఆ ఇంటికి సమీపంలో పాడుబడిన భవనంలోకి గానీ, తుప్పల్లోకి గానీ వెళ్తాడు. అక్కడ మొత్తం దుస్తులను తీసేస్తాడు. ఆ తర్వాత గోడ దూకి ఆ ఇంట్లోకి ప్రవేశిస్తాడు. అనుకున్న పని సజావుగా జరిగిన తర్వాత మళ్లీ దుస్తులు ధరించి అక్కడి నుంచి వెళ్లిపోతాడు. కొంతదూరం వచ్చిన తర్వాత ఉపయోగించిన ఫోన్, సిమ్‌కార్డులను పడేస్తాడు. రూ.1000 విలువ చేసే ఫోన్లు మాత్రమే ఉపయోగిస్తాడు. ఇలా కాజేసిన సొత్తును రెండు, మూడు చోట్ల విక్రయించేస్తాడు. ఈ సొమ్మును తీసుకుని తునికి వెళ్తాడు. నేరుగా ఇంటికి వెళ్లకుండా తన బావమరిదికి కబురుపెడతాడు. తాను ఏ లాడ్జిలో ఉంటున్నాడో బావమరిదికి చెబుతాడు. భార్యాపిల్లలను ఆ లాడ్జికి రప్పించుకుంటాడు. డబ్బును ఆమెకు ఇస్తాడు. తునికి సమీపంలో రూ.80 లక్షలతో భారీ భవనాన్ని నిర్మిస్తున్నట్టు సమాచారం. కంచర్ల మోహనరావుపై విశాఖపట్నం, కాకినాడ, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజమండ్రి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, హైదరాబాద్‌లో సుమారుగా 40 కేసులు ఉన్నాయి.

నన్ను ఎలా పట్టుకున్నారో చెప్పండి ప్లీజ్..

ఏదైనా నేరంలో చిక్కినప్పుడు నిందితులను పోలీసులు ప్రశ్నిస్తారు. సీసీఎస్ పోలీసులను మాత్రం నిందితుడు మోహనరావు ప్రశ్నించాడు. తనను ఎలా పట్టుకున్నారో చెప్పాలని పలుమార్లు అడిగాడు. మోహనరావు చోరీ చేసిన తర్వాత పోలీసులకు చిక్కడానికి రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. అతడు ఎక్కడున్నాడో సమాచారం తెలుసుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. చర్లపల్లి జైలు నుంచి బయటకు రాగానే సీసీఎస్ పోలీసులకు చిక్కడంతో ఈ ప్రశ్న వేసినట్టు తెలిసింది. అతని నుంచి రూ.26 లక్షల విలువ చేసే 349 గ్రాముల బంగారం ఆభరణాలు, రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు.

రేపు జాబ్‌మేళా

బుట్టాయగూడెం, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 28న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కుసుమ తెలిపారు. జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయన్నారు. టెన్త్ నుంచి పీజీ వరకు చదివి, 18-35 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్ల నకళ్ళు, పాస్‌పోర్టు సైజు ఫోటోతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9666322032, 9652503799 నంబర్లలో సంప్రదించాలన్నారు.

విజయవాడకు బస్సు సర్వీసు

చింతలపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నుంచి విజయవాడకు 15 రోజుల్లో బస్సు సర్వీసు ప్రారంభిస్తామని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హామీ ఇచ్చినట్టు మండల జనసేన అధ్యక్షుడు చీదరాల మధుబాబు తెలిపారు. విజయవాడకు వెళ్లాలంటే ఈ ప్రాంత ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, గతంలోను సర్వీసులు రద్దు చేశారని ఆయన దృష్టికి తేగా 15 రోజుల్లో సర్వీసును ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చినట్టు తెలిపారు.

యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష

ఏలూరుసిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో పెదపాడు మండల విద్యాశాఖాధికారులతో గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ సమీక్షించారు. ఈ సందర్భంగా పదవతరగతి విద్యార్థుల 100 రోజుల యాక్షన్‌ప్లాన్‌పై సమీక్షించారు.

ఆయుష్ ఉచిత వైద్యశిబిరం

ఏలూరు అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోస్టల్ బ్యాంక్ రజతోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బ్యాంకు ఏలూరు బ్రాంచి ఆధ్వర్యంలో ఆయుష్ ఆస్పత్రి వైద్య బృందం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి న్యూరో వైద్యులు డాక్టర్ బంకా రవికుమార్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మధుమేహం, అధిక రక్తపోటు బారిన పడుతున్న వారి సంఖ్య జిల్లాలో అనూహ్యంగా పెరుగుతోందన్నారు. ఒత్తిడిలేని జీవనం, పోషక విలువలతో కూడిన తాజా ఆహారం, రోజూ కనీసం గంట వ్యాయామం, పుస్తకాలు చదవడం, ఆధ్యాత్మికత, వీలైనంత వరకు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండటం పాటించాలన్నారు. 40 ఏళ్లు దాటినవారు ఏటా హెల్త్‌చెకప్‌లు చేయించుకుంటే ముందుగానే వ్యాధులను పసిగట్టి, తగు జాగ్రత్తలు పాటించే అవకాశం ఉంటుందన్నారు. బీపీ, సుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేశారు. ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి, బ్యాంకు మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నను కాపాడుకోవాలి

బుట్టాయగూడెం, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): మొక్కజొన్న పంటకు తెగుళ్ళు ఆశించకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు సూచించారు. గురువారం దొరమామిడి, లక్ష్మ్ముడుగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలో 3600 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగవుతోందని, ప్రస్తుతం కాండం తొలుచు పురుగు, తుప్పు తెగులు ఉన్నట్లు గుర్తించామని కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3 కేజీల గుళికలు ఎకరానికి మొక్క సుడులలో వేయాలన్నారు. తుప్పు తెగులు నివారణకు మాంకోజెబ్ 500 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి..

కొయ్యలగూడెం: రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని వ్యవసాయాధికారి చెన్నకేశవులు కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మాట్లాడుతూ రైతులు తగు సూచనలు పాటించకపోవడం వల్ల పంట దిగుబడి రాక నష్టపోతున్నారని అన్నారు.

వీరబాల దివస్‌పై అవగాహన

ఏలూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): వీరబాలదివస్ సందర్భంగా గురువారం ఏలూరు నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో గురుగోవింద్ సింగ్ కుమార్‌లు ఫతేసింగ్, జోరావర్ సింగ్ విజయగాథపై తెలిపారు. ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ వీర బాలురు మొగలాయిల దుశ్చర్యలను ఎదుర్కొన్న వైనాన్ని విద్యార్థులకు వివరించారు. బీజేపీ నాయకులు ఇలపకుర్తి కుసుమకుమారి, ఎన్.దానభాస్కర్, ఎన్.శివ, బర్మా లక్ష్మణరావు, భానుప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణం

పోలవరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పోలవరంలో ఏటిగట్టు సెంటర్‌లో ఉన్న బస్ షెల్టర్ వద్ద మరుగుదొడ్ల నిర్మాణ పనులకు జనసేన మండల నాయకులు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు గునపర్తి చిన్ని మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా బస్ షెల్టర్ వద్ద మరుగుదొడ్లు లేక మహిళా ప్రయాణీకులు విద్యార్థినులు ఎన్నో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఎన్నికల హామీ మేరకు మరుగుదొడ్ల నిర్మాణానికి కృషి చేశారన్నారు. జనసేన సీనియర్ నాయకులు కొణతాల ప్రసాద్, ఆటపాకల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్యాచ్ వర్క్‌ల కోసం కొలతలు

ఉంగుటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు కేతాయి చెర్వు నుంచి దొంతవరం గ్రామం వరకు రహదారికి ప్యాచ్ వర్క్ నిమిత్తం ఇంజనీరింగు సిబ్బంది కొలతలు వేశారు. ఎట్టకేలకు ఈ రహదారికి మరమ్మతులు నిర్వహిస్తారంటూ స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కంసాలిగుంట శివారు చెర్వు మలుపులో కొట్టుకు పోయిన రహదారి

పట్టించుకోండి..

రహదారిపై గుంతతో ప్రమాదాలు

ఉంగుటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి గోకవరం-కంసాలిగుంట జిల్లా పరిషత్ రహదారి మలుపులో చెర్వు గట్టు వద్ద పశువులు దిగుతుండడంతో రహదారి పక్కనే పెద్ద గొయ్యి పడి ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ మలుపు గ్రామ శివారులో ఉండడం, ఈ రహదారి గుండా నిత్యం నాలుగు ప్రైవేటు పాఠశాలల బస్సులు వస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అక్కడ వీధి లైట్లు లేకపోవడంతో రాత్రిపూట ప్రయాణాలు చేయాలంటే భయపడుతున్నారు. దీనిపై సర్పంచ్ ముంద్రు శాంతి మాట్లాడుతూ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, స్పందన అంతంతమాత్రంగానే ఉందన్నారు. సుమారు 40 మీటర్ల పొడవున చెర్వుకు ఆనుకుని రాతి కట్టడం నిర్మిస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని రైతులు చెబుతున్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ వేడుకలు



చింతలపూడిలో సీపీఐ పతాకావిష్కరణ

చింతలపూడి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారంలో పోరాటాలే మార్గంగా సీపీఐ ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకులు ఎం.వసంతరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద గురువారం సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడు తూ 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో పార్టీ ఆవిర్భవించిందని, సంస్థానాలు ప్రభుత్వంలో విలీనం చేయడానికి పోరాడారన్నారు. చంద్ర రాజేశ్వరరావు నాయకత్వంలో భూ పోరాటాల ద్వారా లక్షల ఎకరాలు భూమి పేదలకు పంచడం జరిగిందన్నారు. సీపీఐ నాయకులు జె.రామచంద్రారెడ్డి, ఎస్.కె.కాలేషా, జానీ, వజ్రం, టి.బాబు తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు: ఎందరో నాయకులు, కార్యకర్తల పోరాటాలకు చిహ్నమే ఎర్రజెండా అని సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి అన్నారు. గురువారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుక్కునూరులో వేడుకలు నిర్వహించారు. పార్టీ కార్యాలయం ముందు సీపీఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కుక్కునూరులో భారీ ప్రదర్శన నిర్వహించారు. నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోలవరం: పోలవరంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. మండల కార్యదర్శి జేవీ నరసింహారావు మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాటాలే సీపీఐ ధ్యేయమన్నారు.

బుట్టాయగూడెం: సమస్యలు పరిష్కారమయ్యే వరకు సీపీఐ పేదల పక్షాన పోరాడుతుందని ఆ పార్టీ మండల నాయకుడు బేతి కిషోర్ అన్నారు. గురువారం బుట్టాయగూడెంలో పార్టీ జెండాను మండల కన్వీనర్ చోడెం దుర్గ ఎగురవేశారు. కిషోర్ మాట్లాడుతూ సీపీఐ 99 సంవత్సరాలు పూర్తిచేసుకుని వందవ సంవత్సరంలోకి అడుగుపెట్టినట్లు తెలిపారు.

రీ సర్వే పైలట్ ప్రాజెక్టుగా మాదేపల్లి: చింతమనేని



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): భూముల రీ సర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి రీ సర్వే ప్రాజెక్టు కింద ఎంపికవడంతో గురు వారం అవగాహన కార్యక్రమం, ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మాదేపల్లి రీ సర్వే పైలట్ ప్రాజెక్టుగా ఎంపికవడంతో ఇక్కడ విజయవంత మైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయటం జరుగుతుం దన్నారు. రెవెన్యూ, సర్వే అధికారులు స్వయంగా వచ్చి పరిశీలిస్తారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇద్దరు సర్వేయర్లతో పాటు మూడు టీంలను సర్వేకు ఏర్పాటు చేశామన్నారు. రోవర్‌తో సర్వే చేస్తామన్నారు. నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పి. శేఖర్, చింతపల్లి సాల్మన్‌రాజు, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు నంబూరి నాగరాజు, నవీన్ బోస్ తదితరులు పాల్గొన్నారు.

యువత జూదం వైపు మళ్లకుండా క్రీడలు : బాలరాజు



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, కరాటం

జీలుగుమిల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): యువత జూదం వైపు మళ్లకుండా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను జనసేన నాయకుడు కరాటం రాంబాబు, జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. బర్రింకలపాడు ఏపీ గిరిజన గురుకుల బాలుర పాఠశాల వద్ద గురువారం వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఆర్చరీ, జీలుగుమిల్లి, జూనియర్ కళాశాల వద్ద క్రికెట్, షటిల్ టోర్నమెంట్ క్రీడలు ప్రారంభించారు. జనవరి 8వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. నియోజకవర్గంలో అన్ని మండలాల క్రీడా కారులు ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు.

రోడ్డున పడిన వైద్య ఉద్యోగులను ఆదుకో స్వామీ..

చిన వెంకన్నను వేడుకున్న ఉద్యోగ సంఘనేత ప్రసాద్

ద్వారకాతిరుమల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో వందలాది మంది ఆరోగ్య సహాయకులను ఉద్యోగం నుంచి తొలగించి 20 రోజులు దాటిందని, ప్రభుత్వం నేటికీ స్పష్టమైన ప్రకటన ఇవ్వలేదని ఏపీ కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై న్యాయం జరిగేలా చూడు స్వామీ అంటూ ఆయన చిన వెంకన్న క్షేత్రాన్ని దర్శించి స్వామివారికి తమ గోడు చెప్పుకుని ప్రార్థించినట్లు చెప్పారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోర్టు తీర్పు పేరుతో వారి ఉద్యోగాల తీసేయడంతో ఆరోగ్యసహాయకుల కుటుంబాలు అనాథలై దిక్కులేని పరిస్థితిలో ఉన్నారన్నారు. కోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి పునర్నియామకాలను చేపట్టాలన్నారు. దీనివల్ల నష్టనివారణకు అవకాశంతో పాటు ప్రస్తుతం పనిచేస్తున్న ఎక్కువ మంది తిరిగి ఉద్యోగాలు పొందే వెసులుబాటు కలుగుతుందన్నారు. ఉద్యోగం కోల్పోయిన వారికి మనోధైర్యాన్ని ఇవ్వమని ఆ ఏడుకొండల వాడిని వేడుకున్నట్లు ప్రసాద్ తెలిపారు.

బాదంపూడిలో ఆక్రమణల తొలగింపు

ఉంగుటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రధాన కాల్వ వెంబడి మండలంలోని బాదంపూడిలో గల 8 నివాసాలను గురువారం పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. తొలుత విద్యుత్ కనెక్షన్‌ను తొలగించి అనంతరం తొలగించారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



కోటలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే రోషన్

రూ. 23 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

చింతలపూడి/కామవరపుకోట/లింగపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గంలో రూ. 23 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్టు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. ఎర్రగుంటపల్లిలో రూ. 30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఒక మెగా ఇండస్ట్రియల్ క్లస్టర్ పార్కు ఏర్పాటు చేయబోతున్నామని, దీంతో నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందన్నారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, మాజీ జడ్పీటీసీ రాధారాణి, కక్కిరాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కామవరపుకోటలో రూ. 70 లక్షలతో, పోలాసిగూడెంలో మరో రూ. 70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 983 సీసీ రహదారులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, తహసీల్దార్ గెడ్డం ఎలీషా, ఎంపీడీవో సరళకుమారి, సర్పంచ్ కరిపోతు అనూష తదితరులు పాల్గొన్నారు. లింగపాలెం మండలంలో రూ.70 లక్షలతో నిర్మించిన ఆసన్నగూడెం-బాదరాల సీసీ రోడ్డును ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌తో కలసి కలెక్టర్ ప్రారంభించారు. నూజివీడు సబ్ కలెక్టర్ బి. స్మరణ్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, గరిమళ్ల చలపతిరావు, సర్పంచ్ బొల్లినేని శ్రీనివాసరావు, స్థానిక అధికారులు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కమిషన్ పర్యటన విజయవంతం చేయాలి



ఎమ్మార్పీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకుడు విస్సంపల్లి సిద్ధు మాదిగ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో శుక్రవారం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ పర్యటనను విజయవంతం చేయాలని, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు విస్సంపల్లి సిద్ధు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని దేవులపల్లి గ్రామంలో తుట్టి ఈశ్వర్‌దొర అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో విస్సంపల్లి సిద్ధు మాదిగ హాజరై మాట్లాడారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు జస్టిస్ రాజీవ్‌రంజన్ మిశ్రా కమిషన్ ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకుంటుందని, ఎస్సీవర్గీకరణ సాధన కోసం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల నాయకులు, ప్రజలు, రాజకీయపార్టీలు పెద్దఎత్తున పాల్గొని ఎస్సీవర్గీకరణ సాధన కోసం వినతిపత్రాలు అందించాలని సూచించారు. సంఘాల నాయకులు పాల్గొన్నారు.



'లంక గ్రామస్థులకు కొఠారు తీరని అన్యాయం'

పెదవేగి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కొల్లేటి లంక గ్రామస్థు లకు తీరని అన్యాయం చేశారని గుడివాక లంక గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొల్లేరు చేపల చెరువులకు సంబంధించి కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్థులకు రూ.6 కోట్లు మేర కౌలు సొమ్ము ఇవ్వకుండా ముఖం చాటేశారని, దీనికి నిరసనగా కొఠారు ఇంటి వద్ద కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్థులు చేపట్టిన నిరసనకు మద్దతుగా గుడివాకలంక గ్రామస్థులు గురువారం నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడివాకలంక గ్రామస్థులు మాట్లాడుతూ అబ్బయ్యచౌదరి ఎమ్మెల్యే పదవిని అడ్డుపెట్టుకుని ఐదేళ్ళ పాటు లంక గ్రామస్థుల సొమ్మును దిగమింగాడన్నారు. సొమ్ము ఇచ్చేవరకు నిరసన ఆపేది లేదని భీష్మించారు. నేతల రవి, నంబూరి నాగరాజు, సైదు సత్యనారాయణ, మువ్వల అశోక్‌బాబు, ఘంటసాల తాతరాజు, సైదు శ్రీనివాసరావు, సుబ్బరాజు, భలే వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల ఆందోళన



జంగారెడ్డిగూడెంలో పారిశుధ్య కార్మికులు ఆందోళన

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నిర్వహించిన సమ్మె ఫలితంగా అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.బాలరాజు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ 16 రోజులు చేసిన సమ్మెకు ప్రభుత్వం తమ సంఘాల నాయకులతో చర్చలు జరిపి తమ డిమాండ్‌లను నెరవేర్చటానికి జీవో విడుదల చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. పారిశుధ్య కార్మిక సంఘ అధ్యక్షుడు రేలంగి నాగరాజు, కార్యదర్శి జి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు టూ టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు సోమయ్య కోరారు. ఆర్‌ఆర్ పేట శానిటరీ సర్కిల్ వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ తక్షణమే 12వ పీఆర్‌సీ, ఐఆర్ ప్రకటించాలన్నారు. సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలన్నారు. ఎల్.కృష్ణారావు, ఏ.జాన్‌బాబు, గోపి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయాలిలా..

భీమడోలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వైర్ల మార్పిడి పనుల్లో భాగంగా ఈ నెల 27 నుంచి 31 వరకూ పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ అంబేద్కర్ తెలిపారు. 33/11కెవి గుండుగొలను, ఆగడాలలంక సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్లకు ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఈ పరిధిలో ఉన్న బద్రికోడు, పైడిదిబ్బ, గుండుగొలను, భోగాపురం, వడ్డిగూడెం, కోరుకొల్లు, రత్నాపురం, లక్ష్మీపురం, ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగ దారులు సహకరించాలని కోరారు.

పెదవేగి: పెదవేగి విద్యుత్ ఉపకేంద్రం సెక్షన్ పరిధిలోని కవ్వగుంట ఉపకేంద్రం మరమ్మతు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. కవ్వగుంటతో పాటు ఆ పరిధిలోని గార్లమడుగు, జగన్నాథపురం, వెంకట కృష్ణాపురం, వంగూరు శివారు లక్ష్మీపురం గ్రామాల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలన్నారు.

ఏలూరు రూరల్: ఏలూరు మండలం నార్త్‌సెక్షన్ పరిధిలో ఉన్న 33-11 కేవీ అశోక్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఫీడర్‌కు సంబంధించి చెట్లుకొమ్మలు తొలగింపు, లైన్ల మరమ్మతు చేస్తున్నందున శుక్రవారం ఉదయం 7 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్‌నగర్, అమీనాపేట, కలెక్టరేట్, ఏటిగట్టు, కొత్త బస్టాండు, ఆర్వీ రావు వీధి, గ్రాండ్ ఆర్యరోడ్డు, జగన్‌మోహన్‌రావు వీధి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఉంగుటూరు: మండలంలోని అక్కుపల్లి గోకవరం, కొత్తగూడెం గ్రామాల్లో మెయింటినెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చెట్ల కొమ్మలు తొలగిస్తామని డీఈఈ అంబేడ్కర్ తెలిపారు. 28వ తేదీన చేబ్రోలు సబ్‌స్టేషన్ మెయింటినెన్స్ నిమిత్తం ఉదయం 9 నుంచి సాయంత్రం గం.4-00ల వరకు సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

వైభవంగా ముగిసిన మహారుద్ర హోమం

నిడమర్రు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మందలపర్రు ఉమా నీలకంఠేశ్వర పంచాయతన క్షేత్రంలో మహారుద్రహోమం వైభవంగా సాగింది. గురువారం ముగింపు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్‌ఆర్‌ఐ జ్యోతిష్య పండితుడు అక్కినప్రగడ రామవేంద్రశర్మ ఆధ్వర్యంలో 5 రోజులుగా నిర్వహిస్తున్న మహా రుద్ర హోమంలో మొత్తం 1331 నమక హోమాలు నిర్వహించారు. గురువారం సాయంత్రం మహా పూర్ణాహుతితో హోమపరిసమాప్తి గావించారు. అనంతరం ప్రసాదాల పంపిణీ జరిగింది. ఆలయ నిర్వాహకులు సరిపల్లె శంకరం, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



పారిజాతగిరిలో హుండీ ఆదాయం లెక్కింపు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. 90 రోజులకు గాను రూ.9,54,726లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో రాంబాబు తెలిపారు. హుండీ లెక్కింపులో ఏలూరు, విజయవాడ రిటైర్డ్ ఉద్యోగుల యూనియన్ సభ్యులు, కామయ్యపాలెం, పుట్లగట్లగూడెం సేవా సంఘం, ఇండియన్ బ్యాంక్ అధికారులు, ఆలయ సిబ్బంది, అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నట్లు ఈవో తెలిపారు.



షిరిడీ సాయి ఆలయాల్లో ధనుర్మాస పూజలు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): ధనుర్మాసం సందర్భంగా గురువారం నగరంలోని పలు డివిజన్లలో గల షిరిడీసాయి మందిరాల వద్ద భక్తులు సామూహిక ధనుర్మాస పూజలు చేశారు. బాబాకు అభిషేకాలు నిర్వహించారు. ఆదివారపుపేటలోని షిరిడీసాయి ప్రేమ మందిర్ వద్ద ఆలయ శాశ్వత ధర్మకర్త ఇసుకపల్లి తాతారావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణను నిర్వహించారు. సాయంత్రం పల్లకి సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఏలూరులో నివాళి

రంగాకు ఘన నివాళి

లింగపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి సంద ర్భంగా లింగపాలెం మండలం వేములపల్లి లో రంగా విగ్రహానికి చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పూల మాలలువేసి నివాళు లర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

ఏలూరు రూరల్: కాపు, బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కుప్పాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ రెడ్డి కళాశాల వద్ద గల రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగా ఆశయ సాధన కోసం కృషి చేస్తామన్నారు.

చింతలపూడి: స్థానిక పాతబస్టాండ్‌లోని రంగా విగ్రహం వద్ద విగ్రహ కమిటీ నిర్వాహకులు, అభిమానులు రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కొత్తపూడి శేషగిరిరావు, తోట శివనాగరాజు, ముత్యాల శ్రీనివాస్, బొడ్డు వెంకటేశ్వరరావు, టి.ఎస్.వి. కుమార్, థామస్ తదితరులు పాల్గొన్నారు.

భీమడోలు: భీమడోలులోని కాపు సంఘం నేతలు రంగా విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులు, పంచాయతీ సిబ్బందికి పళ్ళు పంపిణీ చేశారు. సంఘ నేతలు పసుపులేటి శ్రీనివాస్, ప్రత్తిమదన్, పుల్లయ్యనాయుడు, చింతా రాము, ఏడుకొండలు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద, పరింపూడిలో రంగా విగ్రహాలకు అభిమానులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా సేవలను గుర్తు చేశారు.

కామవరపుకోట: రంగా వర్ధంతిని మండ లంలోని పలు గ్రామాల్లో గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పెద్ద సంఖ్యలో రంగా అభిమానులు పాల్గొన్నారు. ఆయన సేవలను కొనియాడారు.

ఉంగుటూరు: కైకరంలో జాతీయ రహదారి సెంటర్‌లోని రంగా విగ్రహానికి గురువారం పలువురు కాపు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోలవరం: ఒక్కడై వచ్చి కోట్లాది ప్రజలకు భరోసాగా నిలిచిన నేత వంగవీటి మోహనరంగా అని జనసేన సీనియర్ నాయకులు కొణతాల ప్రసాద్ అన్నారు. గురువారం పోలవరంలో నూతన గూడెం వద్ద రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు గునపర్తి చిన్ని, తెలగంశెట్టి రాంప్రసాద్, ఆటపాకల వెంకటేష్, మొగళ్ళ హరిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

దెందులూరు: బడుగు, బలహీన వర్గాల కోసం పాటుపడిన కాపు సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగా సేవలు ప్రజలు మరువలేరని టీడీపీ దెందులూరు మండల అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ (మిల్లుబాబు)అన్నారు. రంగా వర్ధంతి సంద ర్భంగా జనసేన నాయకుడు కొండేటి హనుమంతు, పూజారి శ్రీనివాస్ కాపు సంఘం ఆధ్వర్యంలో గోపన్నపాలెంలో రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గాలా యగూడెంలో టీడీపీ నాయకుడు పూజారి శ్రీనివాసరావు, కాపు సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పూజారి వెంకటరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో బేటీ సమ్మాన్

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా శ్రీ చైతన్య పాఠశాలలో బేటీ సమాన్ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. స్థానిక నిర్మల ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్.గిరిజ విద్యార్థినులకు ఆరోగ్యభద్రత, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, శుభ్రతపై వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరిజను శ్రీ చైతన్య పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఏవో కె.శ్రీనివాస్, డీన్ రామ్మోహన్, ప్రైమరీ ఇన్‌చార్జ్ రజనీరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

లింగపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాజీగూడెంలో ఎస్‌ఐ కే వెంకన్న వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలను ఇస్తే చర్యలు తప్పవన్నారు. వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, నంబరు ప్లేటు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఏఎస్‌ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ బాలగోపాలస్వామి వారి దేవస్థానం

కాగుపాడు గ్రామం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా

ఇందుమూలముగా యావన్మందికి తెలియ జేయునది ఏమనగా, ఉంగుటూరు మండలం, కాగుపాడు గ్రామంలో వెంచేసియున్న శ్రీ బాలగోపాలస్వామి వారి దేవస్థానమునకు ఉంగుటూరు మండలం కాగుపాడు గ్రామంలో ఆర్.ఎస్.నెం.200/1 రు లో యె 3.48 సెంట్లు మరియు ఆర్.ఎస్.నెం.203/2 రు లో యె 2.68 సెంట్లు వెరశి యె 6.16 సెంట్లు భూములు కలవు. సదరు భూములు దేవాదాయ ధర్మదాయశాఖ చట్టం సెక్షన్ 43(10) రిజిష్టర్లు నందు నమోదు చేయుటకు నిర్ణయించుట జరిగినది.

కావున ఇందు విషయమై మీకు ఏమైనా అభ్యంతరములు, ఆక్షేపణలు యున్న యెడల యీ ప్రకటన ఇచ్చిన తేది నుండి పదిరోజులలో లిఖిత పూర్వకముగా శ్రీయుత జిల్లా ఎండోమెంట్ అధికారి, దేవదాయ ధర్మదాయ శాఖ, ఏలూరు వారికి అందచేయగలరు.

కాగుపాడు | కార్యనిర్వహణాధికారి
ది.26.12.2024 | సెల్: 9490433413

భూమి.. బూమ్!

పంట భూముల ధరలకు రెక్కలు..

ఎకరాకు రూ.4 లక్షల వరకు విలువ పెంపు ప్రతిపాదనలు

కొత్త సంవత్సరం నుంచి కొత్త ధరలు అమలు?

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

భూముల విలువ ప్రభుత్వం మరోసారి పెంచబోతుంది. మెట్ట, మాగాణి, పండ్ల తోటలతో పాటు వివిధ లేఅవుట్‌లలో భూమి విలువలను సవరించి ప్రతిపాదిత ధరలను ఇప్పటికే రిజిస్ట్రేషన్ కార్యాలయాల నోటీసు బోర్డులో ఉంచారు. జనవరి 1 నుంచి ప్రతిపాదిత ధరలతో రిజిస్ట్రేషన్లు జరగబోతున్నాయని అంచనా.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇప్పటికే భూముల విలువలను 10 నుంచి 15 శాతం మేర పెంచుతూ కొత్త ధరలను ప్రతిపాదించారు. ఇప్పటికే అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల ప్రతిపాదిత విలు వ లెక్కించి ప్రజాభి ప్రాయం నిమిత్తం బహిర్గతం చేయాల్సిందిగా ఆదేశించింది. ఈ మేరకు జేసీ ధాత్రిరెడ్డి నేతృత్వంలో గత వారం సబ్ రిజిస్ట్రార్‌లతో ప్రత్యేక సమీక్ష జరిగింది. కొనుగోలుదారులు కాస్తంత భారాన్ని మోయాల్సి రావచ్చు.

నివాస యోగ్యమైన స్థలాల విలువ 10 నుంచి 15 శాతం మేర పెరగబోతున్నాయి. మిగతా భూములతో పోలిస్తే పండ్ల తోటలకు నెలవైన భూముల ధరలు కాస్త అటుఇటూగా ఉండేవి. కాని ఈసారి వాటి విలువ భారీగా పెరిగినట్టు ప్రతిపాదిత విలువను బట్టి నిర్ధారణ అవుతోంది.

నూజివీడు పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు కూడా పుంజుకోబోతున్నాయి. నూజివీడులో మెట్ట భూములు ఎకరా రూ.45 లక్షలు, మాగాణి భూములు రూ. 46 లక్షలు, మామిడి తోటలు రూ.47 లక్షలకు పెరగబోతున్నాయి. ఆగిరిపల్లి మం డల ప్రాంతంలో మామిడి ఎకరా రూ.20 లక్షలు, మాగాణి రూ.19 లక్షలు వరకు భూమి విలువలు పెరగబోతున్నాయి. నూజివీడు రూరల్ ప్రాంతంలో మెట్ట ఎకరా భూమి రూ.12 లక్షలకు ఎగబాకింది. కైకలూరులో గజం రూ.7,500 ఉండగా, ప్రతిపాదిత విలువను బట్టి రూ.8,500 వరకు పెరగనుంది. అదే గ్రామీ ణ ప్రాంతాల్లో రూ.1,100 నుంచి రూ.1,500 విలువ పెంచబోతున్నారు. జంగారెడ్డి గూడెంలో గజం రూ.6,500 నుంచి రూ.7,500 వరకు పెంచనున్నారు. ఇక్కడే రాజులకాలనీలో గజం రూ.9,500 నుంచి రూ.10,500 వరకు పెరగబో తుంది. రూరల్ ప్రాంతంలో రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెరగనున్నట్టు చెబుతున్నారు. చింత లపూడిలో గజం రూ.30 వేలు ఉండగా, ఇప్పుడు ఆ ధర రూ.35 వేలకు ప్రతిపాదించారు. సరాసరి ప్రతిపాదిత విలువ 15 శాతం మేర ఉన్నట్టు చెబుతున్నారు. భూముల విలువ భారీగా పెరగ నుండగా ఆ మేరకు రిజిస్ట్రేషన్ల ఆదాయం భారీగా పుంజుకోనుంది. సబ్ రిజిస్ట్రార్లు ప్రతిపాదించిన భూమి విలువలకు చాలాచోట్ల ప్రభుత్వం ఆమోద ముద్ర వేసే అవకాశం ఉంది. ఈనెల 28 నాటికి ప్రతిపాదిత ధరలను నోటిఫై చేస్తారని చెబుతు న్నారు. ఇదే జరిగితే కొత్త సంవత్సరం నుంచే పెరిగిన ధరలతో రిజిస్ట్రేషన్లు ఉండబోతున్నాయి.

ట్రిపుల్‌ఐటీకి విద్యుత్ అంతరాయం

ఉదయం పరీక్ష మధ్యాహ్నానికి వాయిదా

వేంపల్లె, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. బుధవారం అర్ధరాత్రి 1.30గంటల ప్రాంతంలో సరఫరా నిలిచిపోగా గురువారం ఉదయం 10గంటల సమయంలో విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీంతో రాత్రంతా విద్యార్థులు, అధ్యాపకులు, అక్కడి క్వార్టర్స్‌లో సిబ్బంది అవస్థలు పడ్డారు. ట్రిపుల్‌ఐటీలో విద్యుత్ సరఫరా అయ్యే గదిలోని ప్యానల్స్‌లో బల్లులు ఉండడం వల్ల కరెంటు నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది హుటాహుటిన తనిఖీ చేసి సమస్య పరిష్కరించి సరఫరా పునరుద్ధరించారు. కాగా.. విద్యుత్ లేని కారణంగా గురువారం ఉదయం పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు జరగాల్సిన ఫిజిక్స్ పరీక్షను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ఇడుపులపాయలో అంతరాయం వల్ల రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లోను ఫిజిక్స్ పరీక్షను ఉదయం వాయిదా వేసి మధ్యాహ్నం నిర్వహించామని ట్రిపుల్‌ఐటీ పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానము

కొత్తపేట, నూజివీడు (టౌన్ & మండలము), ఏలూరు జిల్లా

లీజు హక్కు బహిరంగ వేలము ప్రకటన

ఏలూరు జిల్లా, నూజివీడు పట్టణంలో వేంచేసియున్న శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానమునకు సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములు గల 6 షాపులు ఉన్నవి ఉన్నట్లుగా 3 సంవత్సరముల కాలపరిమితికి (అనగా 2025 - 26 నుండి 2027-28 వరకు) నెలవారీ అద్దెకు ఇచ్చుటకు ది.6-01-2025 సోమవారం మధ్యాహ్నం గం. 2-00 లకు, నూజివీడు శ్రీ కొడిమెల కొండయ్య శ్రీరామ విలాస సత్రము నందు బహిరంగ వేలం పాట దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులచే నిర్వహించబడును. గాన పాటయందు పాల్గొనువారు ఈ క్రింది విధముగా ధరావతు చెల్లించి పాల్గొనగలరు.

షాపు నెం.	షాపు కొలతలు	పాట కాలపరిమితి	ప్రథమ ధరావత్తు
1	10×15 చ.అ.లు	3 సంవత్సరములు అనగా 2025-2026 నుండి 2027- 2028 వరకు	రూ.12,000/- (షాపు1కి)
2	5×15 చ.అ.లు		
3	5×15 చ.అ.లు		
4	10×12 చ.అ.లు		
5	10×15 చ.అ.లు		
6	5×6 చ.అ.లు		

పైన తెలిపిన షాపులకు ముఖ్యమైన పాట షరతులు:

1.ఈ వేలముపాట హిందూ దేవదాయ ధర్మాదాయశాఖ అధికారుల ఆమోదపు ఉత్తర్వులకు లోబడి జరుగును. 2. ఏ కారణము తెలుపకనే వేలము వాయిదా వేయుటకు, నిలుపుదల చేయుటకు, రద్దు చేయుటకు మేనేజ్‌మెంట్ వారికి అధికారము కలదు. 3. హెచ్చు పాటదారుడు సదరు షాపును వేరొకరికి సబ్‌లీజుకు ఇవ్వరాదు. అట్లు ఇచ్చిన యెడల అతని పాటను రద్దు చేయబడును. 4. దేవాలయముతో ఎట్టి లావాదేవీలు, బకాయిలు ఉన్నవారు కాని, వారి వారసులు కాని వేలంపాటలో పాల్గొనరాదు. వేలంనందు పాల్గొనకుండా తిరస్కరించు అధికారం మేనేజ్మెంట్ వారికి కలదు. 5. హెచ్చు పాటదారుడు ప్రతినెల అద్దె 1 నుండి 5వ తేదీలోపు చెల్లించి తగు రశీదు పొందగలరు. 6. వేలం షరతులు మార్పువేయుటకు దేవస్థానం వారికి అధికారం కలదు. 7. హెచ్చుపాట పాడుకొన్న పాటదారుడు 1 సం॥ము అద్దె సెక్యూరిటీ డిపాజిట్ వెంటనే చెల్లించవలెను. లీజు కాలపరిమితి ముగిసిన తర్వాత సెక్యూరిటీ డిపాజిట్ ఎటువంటి వడ్డీ లేకుండా తిరిగి చెల్లించబడును. 8. పై అధికారుల నుండి అప్రూవల్ ఆర్డర్ వచ్చిన ప్రకారము హక్కు పొందిన పిదప షాపు స్వాధీనపర్చబడును. 9. దేవాలయము వద్ద మత్స్య, మాంస, మత్తుపానీయాలు, క్రిమి సంహారక మందుల వ్యాపారము చేయరాదు. 10. పాటదారులు భక్తులతో మర్యాదగా మెలగవలెను. వారితో ఎలాంటి గొడవలు చేయరాదు. అట్లు చేసిన యెడల వారి పాటలు రద్దు చేయబడును.

ఇతర వివరములకు దేవాలయము కార్యాలయములో పనిచేయు సమయములో తెలుసుకొనవచ్చును.

నూజివీడు, 24-12-2024 ఇట్లు, కార్యనిర్వహణాధికారి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మదాయశాఖ

శ్రీ కొడిమెల కొండయ్య శ్రీరామవిలాస సత్రం, నూజివీడు

షాపులు లీజు హక్కు టెండర్ కమ్ బహిరంగ వేలము ప్రకటన

ఏలూరు జిల్లా, నూజివీడు పట్టణం మైలవరం రోడ్లో గల శ్రీ కొడిమెల కొండయ్య శ్రీరామ విలాస సత్రమునకు సంపూర్ణ హక్కుభుక్తములు గల షాపులు 3 సంవత్సరముల కాలమునకు అనగా 2025-2026 నుండి 2027-2028 వరకు నెలవారీ అద్దెకు ఇచ్చుటకుగాను ది. 6-01-2025 సోమవారం ఉదయం 11 గంటలకు సదరు సత్రంలో గల నెహ్రూభవన్లో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షములో సత్రం కార్యనిర్వహణాధికారి వారిచే లీజుహక్కు బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును. కావున పాటలో పాల్గొనదలచినవారు ఈ క్రింది తెల్పిన విధముగా ప్రథమ ధరావత్తులు చెల్లించి పాటలో పాల్గొనగలరు.

బ్లాకు నెం.	షాపు నెం.	కొలతలు	పాట కాలము	ప్రథమ ధరావత్తు	రిమార్కులు
I	1	9.7×11.3=11.97 చ.గ	2025-26 నుండి 2027-28 వరకు	రూ.20,000/-	హెచ్చు తగ్గులతో నిమిత్తం లేకుండా
	2	10.0×11.3=12.50 చ.గ		,,	
	3	11.1×11.3=13.85 చ.గ	,,	,,	,,
	4	10.3×11.3=12.81 చ.గ	,,	,,	,,
	5	8.6×11.3=10.62 చ.గ	,,	,,	,,
	6	8.6×11.3=11.62 చ.గ	,,	,,	,,
	7	9.1×11.3=11.35 చ.గ	,,	,,	,,
	8	8.6×11.3=10.62 చ.గ	,,	,,	,,
	9	10.2×11.3=12.71 చ.గ	,,	,,	,,
	10	8.11×24.0=23.77 చ.గ	,,	,,	,,
	11	8.7×24.0=23.77 చ.గ	,,	,,	,,
	12	16.0×13.0=24.59 చ.గ	,,	,,	,,
II	1	9.8×10=11.07 చ.గ	,,	,,	,,
	2	21.6×10.8=25.35 చ.గ	,,	,,	,,
	3	9.6×9.1=9.58 చ.గ	,,	,,	,,
	4	9.6×9.1=9.58 చ.గ	,,	,,	,,
	5	30.20×29.24=30.93 చ.గ	,,	,,	,,
	6	9.2×11.3=11.03 చ.గ	,,	,,	,,
	7	12.10×10.0=14.25 చ.గ	,,	,,	,,
	8	12.7×10.6=14.68 చ.గ	,,	,,	,,
	9	9.6×5.11=6.95 చ.గ	,,	,,	,,
	10	9.10×9.6=9.84 చ.గ	,,	,,	,,
	11	15.5×35.19=35 చ.గ	,,	,,	,,
III	1	3.7×9.0=3.58 చ.గ	,,	రూ.10,000/-	

పైన తెలిపిన షాపులకు ముఖ్యమైన పాట షరతులు :

1. ఈ వేలము పాటలు హిందూ దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల ఆమోదపు ఉత్తర్వులకు లోబడి సంస్థ కార్యనిర్వహణాధికారి వారిచే నిర్వహించబడుచున్నవి. 2. పైన తెల్పిన ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవలెను. 3. సత్రముతో ఏటువంటి కోర్టు లావాదేవీలు కాని, బకాయిలు ఉన్నవారు కాని, వారి సంబంధీకులు కాని ఈ వేలంపాటలో పాల్గొనరాదు. అట్లు పాల్గొనకుండా వారిని తిరస్కరించు అధికారం డిపార్టుమెంట్ వారికి కలదు. 4. సత్రం అధికారి వారి అనుమతి లేకుండా శాశ్వత కట్టడములు నిర్మించరాదు. విద్యుత్ కనెక్షన్ హెచ్చు పాటదారుడే ఏర్పాటు చేసుకొనవలెను. పాట కాలపరిమితి ముగిసిన వెంటనే కట్టడములు, కరెంటు సర్వీసులు సత్రం వారికే చెందును. 5. హెచ్చుపాటదారుడు (డిపాజిట్) ప్రథమ ధరావత్తు పాటకాలము ముగిసిన తదుపరి తిరిగి చెల్లించబడును. దీనికి వడ్డీ ఇవ్వబడదు. 6. హెచ్చు పాటదారుడు అద్దె ప్రతినెల 1 నుండి 5వ తేదీలోపు చెల్లించి తగు రశీదు పొందవలెను 7. షాపు లీజుహక్కు పొందినవారు షాపులో మద్య, మాంస, మత్తు పానీయములు, మాదక ద్రవ్య వ్యాపారములు (చట్టవిరుద్ధ పనులు), అమ్మరాదు. నిలువ చేయరాదు. 8. సత్రం అధికారి వారి అనుమతి లేకుండా వేరొకరికి సబ్ లీజుకు ఇవ్వరాదు. అట్లు ఇచ్చిన యెడల వారి లీజుహక్కు రద్దుపరచబడును. 9. ఈ వేలం పాట షరతులు మార్పుచేయుటకు, లేదా ఏ కారణము తెలుపకనే వాయిదా వేయుటకు, లేక రద్దుచేయుటకు డిపార్టుమెంటువారికి అధికారము కలదు. 10. ఈ వేలంపాటలో హిందూయేతరులు పాల్గొనరాదు. 11. హెచ్చు పాట పాడుకొన్న పాటదారుడు 1 సం.రము అద్దె సెక్యూరిటీ డిపాజిట్ వెంటనే చెల్లించ వలెను. లీజు కాలపరిమితి ముగిసిన తర్వాత సెక్యూరిటీ డిపాజిట్ ఎటువంటి వడ్డీ లేకుండా తిరిగి చెల్లించబడును. మిగిలిన పాట షరతులు పాటకాలమునందు తెలియజేయబడును. ఇతర వివరములు సత్రం ఆఫీసునందు పనివేళలలో అడిగి తెలుసుకొనగలరు.

నూజివీడు 24-12-2024 ఇట్లు : కార్యనిర్వహణాధికారి.

రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి

మండవల్లి/కలిదిండి/ముదినేపల్లి/కైకలూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ఎమ్మెల్యే దివంగత వంగవీటి మోహనరంగా ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి సందర్భంగా మండవల్లి సెంటర్లో మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, జయమంగళ వెంకటరమణ వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీపీ పెద్దిరెడ్డి రాము, పలువురు కూటమి నివాళులర్పించారు. అనంతరం మూడువేల మందికి అన్నసమారాధన చేశారు. కలిదిండిలో కూటమి నాయకులు, రంగా అభిమానులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. డీసీ ఛైర్మన్ పేటేటి సత్యనారాయణ, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. కోరుకొల్లులో కాపు సంక్షేమ సంఘం నాయకులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులో రంగా విగ్రహానికి టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ముదినేపల్లిలో గురజ రోడ్డులోని రంగా విగ్రహానికి ఏపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పెదగొన్నూరు డీసీ ఛైర్మన్ గుడిసేవ సురేష్ బాబు, కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాచూరి రాధా సుకన్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శీలం రామకృష్ణ, ముదిరాజ్ సంఘ రాష్ట్ర కార్యదర్శి కోమటి విష్ణువర్ధన్ తదితరులు ముదినేపల్లి, నరసన్నపాలెంలో రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కైకలూరులో వంగవీటి రంగా వర్ధంతి సందర్భంగా పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కైకలూరులో రంగా విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, తదితర కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.



కలిదిండిలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు, అభిమానులు



ముదినేపల్లిలో రంగాకు నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా : సబ్ రిజిస్ట్రార్

ముదినేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో సబ్ - రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించే విషయమై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని సబ్ - రిజిస్ట్రార్ చింతా రజిత తెలిపారు. '97 ఏళ్లుగా అద్దె భవనాలే దిక్కు' శీర్షికన ముదినేపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం లేని అంశంపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు ఆమె స్పందించారు. భవన నిర్మాణానికి అవ సరమైన స్థలం కేటాయింపు, నిధుల మంజూరు విష యాలను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళతాను. గతంలో ముదినేపల్లి మండల కార్యాలయాల సముదాయం ఆవరణలో స్థలం కేటాయింపు కోరుతూ పలువురు రిజిస్ట్రార్లు తహసీల్దార్ ద్వారా అప్పటి కృష్ణా జిల్లా కలెక్టర్‌కు లెటర్లు పంపారు. ఆ విషయాన్ని శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా'నని తెలిపారు.

బహుళ ప్రయోజనకరంగా కృషిక యాప్

సింగరాయపాలెం రైతు సదస్సులో కేంద్ర వ్యవసాయ బృందం సభ్యుల వెల్లడి

ముదినేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు బహుళ ప్రయోజనకారిగా ఉండే విధంగా రూపొందించిన కృషిక యాప్‌పై అవగాహన కల్పించేందుకు చేపట్టిన దేశవ్యాప్త పర్యటనలో భాగంగా కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ అధికారుల బృందం గురువారం ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలో పర్యటించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు, వ్యవసాయ నిపుణులు రవీందర్ కుమార్, కుమారి ప్రియా, దీపక్ రాజ్‌పుట్‌తోపాటు ఐసీఐసీఐ ఇన్సూరెన్స్ కేంద్ర కార్యాలయ ప్రతినిధులు మండలంలోని సింగరాయపాలెంలో వ్యవసాయ శాఖ ఏడీఏ జి.వెంకటమణి అధ్యక్షతన రైతులకు కృషిక యాప్ పనితీరుపై అవగాహన కల్పించారు. అన్ని అంశాలతో రైతులకు పూర్తిస్థాయిలో రూపొందించిన కృషిక్ యాప్‌ను జనవరిలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని బృందం సభ్యుడు రవీందర్ కుమార్ తెలిపారు. సదస్సులో 12 మంది రైతుల వివరాలను యాప్‌లో ప్రయోగాత్మకంగా నమోదు చేసి ప్రదర్శించారు. జిల్లా రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ లలిత సుధ, ఏవోలు వేణు మాధవ్, ఉష తదితరులు పాల్గొన్నారు.



కృషిక యాప్‌పై అవగాహన కల్పిస్తున్న కేంద్ర వ్యవసాయ శాఖ బృంద సభ్యులు

నేడు సిసోడియా పెదపాలపర్రు రాక

ముదినేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామ్ ప్రకాశ్ సిసోడియా శుక్రవారం ముదినేపల్లి మండలం పెదపాలపర్రుకు రానున్నారు. గ్రామంలో ఉదయం 11 గంటలకు జరగనున్న రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొంటారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్‌తోపాటు జిల్లా రెవెన్యూ అధికారులు పలువురు ఈ సదస్సులో పాల్గొంటారు. మండల ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస్, తహసీల్దార్ సుభానీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు.

పంటలను బీమా చేయించుకోవాలి

కలిదిండి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ గురువారం ప్రకటనలో తెలిపారు. వరి పంటకు ఎకరానికి రూ.500, మినుము పంటకు ఎకరానికి రూ.60 చొప్పు ప్రీమియంను డిసెంబరు 31వ తేదీలోగా చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల్లో వరి పంటకు నష్టం వాటిల్లితే ఎకరానికి రూ.41 వేలు, మినుము పంటకు ఎకరానికి రూ.20 వేలు చొప్పున పంట నష్టపరిహారం అందజేస్తారన్నారు. వివరాలకు ట్రోల్ ఫ్రీ నెంబర్ 14447ను సంప్రదించాలన్నారు.

సవరించిన రెవెన్యూ సదస్సుల షెడ్యూల్

ముదినేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో సవరించిన రెవెన్యూ సదస్సుల నిర్వహణ షెడ్యూలును తహసీల్దార్ జె.ఎస్.సుభానీ ప్రకటించారు. తాజా షెడ్యూలు ప్రకారం ఈ నెల 27న పెదపాలపర్రు, చిగురుకోట, 28న చినకామనపూడి, పెదకామనపూడి, 30న వడాలి, కోమర్రు, 31న కాకరవాడ, దేవరం, జనవరి 2న గోకినంపాడు, సింగరాయపాలెం, 3న గురజ, పెనుమల్లి, 4న సంకర్షణపురం, కొరగుంటపాలెం, 6న ఈడేపల్లి, అల్లూరు, 7న ములకలపల్లి, బొమ్మినంపాడు, 8న ప్రొద్దువాక, దేవపూడి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

ముదినేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూములకు సంబంధించిన సమస్యల పరిష్కా రాన్ని రైతులు రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని ముదినేపల్లి తహసీల్దార్ జె.ఎస్. సుభానీ కోరారు. పెయ్యేరులో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై వచ్చిన అర్జీలన్నింటినీ ఆన్‌లైన్ చేసి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండల ప్రత్యేక అధికారి పి.శ్రీనివాస్, సర్పంచ్ అల్లు సుశీల, వీఆర్వో కె.కేశవ తదితరులు పాల్గొన్నారు. జాయింట్ ఎల్‌పిలు, సబ్ డివిజన్ల సర్వేకు సంబంధించి రైతుల నుంచి పలు అర్జీలు అందాయి.

పెదగొన్నూరు పంచాయతీకి గ్రోవెల్ కంపెనీ వితరణ

ముదినేపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెంలోని గ్రోవెల్ ప్రాసెసింగ్ యూనిట్ పెదగొన్నూరు పంచాయతీకి వీధి దీపాలను విరాళంగా అందజేసింది. సుమారు రూ.9 లక్షల విలువైన 36 వాట్స్ సామర్థ్యం కలిగిన 580 విద్యుత్ వీధి దీపాలను ఆ యూనిట్ హెచ్ఆర్ ప్రతిమ గురువారం పంచాయతీ సర్పంచ్ తాడంకి శిరీషకు అందజేశారు. ఆ గ్రామ ప్రముఖుడు సినీ నిర్మాత డాక్టర్ కె.ఎల్.నారాయణ సూచనతో గ్రోవెల్ కంపెనీ యాజమాన్యం పెదగొన్నూరు పంచాయతీకి వితరణతో వీధి దీపాలను అందజేశారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం: సబ్ కలెక్టర్

ముసునూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభల్లో భూ సమస్యలపై వచ్చే అర్జీలను దశల వారీగా పరిష్కారిస్తామని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అన్నారు. గురువారం చింతలవల్లిలో జరిగిన గ్రామసభను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రామ సభలో 9 అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తమశర్మ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రాణి, ఈవోపీఆర్డీ బి.ఏ సత్యనారాయణ పాల్గొన్నారు.



చింతలవల్లిలో అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

55 అర్జీలు స్వీకరణ

ఆగిరిపల్లి: ఈదులగూడెంలో గురువారం తహసీల్దార్ పి.ఎస్.వి ప్రసాద్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 55 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మరియన్న, సర్వేయర్ గంగరాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యపై రైతుల ఆందోళన



సబ్‌స్టేషన్ గేటువేసి ఆందోళన చేస్తున్న రైతులు

ముసునూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని చింతలవల్లికి చెందిన రైతులు సబ్‌స్టేషన్ గేటు మూసివేసి గురువారం ఆందోళన చేశారు. నాలుగు రోజుల నుంచి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలకు నీరు అందించలేక పోతున్నామని, వేలాది రూపాయలు కౌలు కట్టి వ్యవసాయం చేస్తున్నామని సకాలంలో పంటలకు నీరు పెట్టకపోతే పంట ఎలా పండుతుందని కౌలు రైతు మందపాటి కిషోర్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. లైన్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు రైతులతో మాట్లాడి, సమస్యను వెంటనే పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

నూతన బోరు ఏర్పాటు



నూతన బోరులో మోటారు బిగిస్తున్న దృశ్యం

ముసునూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిగూడెం సంపద కేంద్రానికి నీటి సౌకర్యం కోసం నూతనంగా వేసిన బోరులో గురువారం విద్యుత్ మోటారును సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ ఆధ్వర్యంలో బిగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 5లక్షల 50వేలతో సంపద కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

తూనికలు, కొలతలశాఖ తనిఖీలు



కాటాలను తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్

నూజివీడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో నూజివీడులోని రేషన్ దుకాణాలను గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ కాటాలకు తూకాలు వేసి, లీగల్ మెటలర్జీ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు సర్టిఫికెట్ జారీ చేశారు. కొలతలు, తూనికల్లో ఎటువంటి తేడాలు ఉన్నా కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

చాట్రాయి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పోలవరంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం శిబిరం నిర్వహించారు. 23 మంది వృద్ధులను ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కంటి వైద్య నిపుణుడు దత్తు 47 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చెలికాని బాబ్జీ శిబిరాన్ని ప్రారంభించగా, ఎన్టీఆర్ జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు బీవీఎస్‌టీ సాయి, ట్రస్ట్ అధ్యక్షుడు జె రంగారెడ్డి, కార్యదర్శి రామశేషు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ వేంకటాచలస్వామి వారి దేవస్థానము

కొత్తపేట, నూజివీడు (టౌన్ & మండలం), ఏలూరు జిల్లా

లీజు హక్కు టెండర్ కమ్ బహిరంగ వేలము ప్రకటన

ఏలూరు జిల్లా, నూజివీడు పట్టణంలో వేంచేసియున్న శ్రీ వేంకటాచలస్వామి వారి దేవాస్థమునకు సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములు గల 4 షాపులను ఉన్నవి ఉన్నట్లుగా 3 సంవత్సరముల కాలపరిమితికి (అనగా 2025-26 నుండి 2027-28 వరకు) నెలవారీ అద్దెకు ఇచ్చుటకు ది. 06-01-2025 సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు, సదరు కొండయ్య గారి సత్రం, నెహ్రూభవన్‌లో బహిరంగ వేలంపాట దేవాదాయ ధర్మదాయశాఖ అధికారులచే నిర్వహించబడును. గాన పాటయందు పాల్గొనువారు ఈ క్రింది విధముగా ధరావత్తుచెల్లించి పాల్గొనగలరు.

వ.నెం.	వివరము	కాలము	ప్రథమ ధరావత్తు
1	షాపు నెం.1 5 x 7 చ.గ.లు	3 సంవత్సరములు అనగా 2025 - 2026 నుండి 2027-2028 వరకు	రూ. 20,000/-
2	షాపు నెం.3 6 x 7 చ.గ.లు		రూ. 20,000/-
3	షాపు నెం.9 12 x 10 చ.గ.లు		రూ. 20,000/-
4	షాపు నెం.11 12 x 12 చ.గ.లు		రూ. 20,000/-

ముఖ్యమైన షరతులు : (1) ఈ వేలముపాట హిందూ దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారుల ఆమోదపు ఉత్తర్వులకు లోబడి జరుగును. (2) ఏ కారణము తెలుపకనే వేలము వాయిదా వేయుటకు, నిలుపుదల చేయుటకు, రద్దు చేయుటకు కార్యనిర్వహణాధికారివారికి అధికారము కలదు. (3) హెచ్చు పాటదారుడు సదరు షాపును వేరొకరికి సబ్‌లీజుకు ఇవ్వరాదు. అట్లు ఇచ్చిన యెడల అతని పాటను రద్దు చేయబడును. (4) దేవాలయముతో ఎట్టి లావాదేవీలు. బకాయిలు ఉన్నవారు కాని, వారి వారసులు కాని వేలంపాటలో పాల్గొనరాదు. వేలంనందు పాల్గొనకుండా తిరస్కరించు అధికారం కార్యనిర్వహణాధికారి వారికి కలదు. (5) హెచ్చుపాటదారుడు ప్రతినెల అద్దె1 నుండి 5వ తేదీలోపు చెల్లించి తగు రశీదు పొందగలరు. 5వ తేదీ దాటిన అద్దె చెల్లింపులపై రూ.2-00ల వడ్డీ వసూలు చేయబడును. (6) వేలం షరతులు మార్పువేయుటకు దేవస్థానం వారికి అధికారం కలదు. (7) పై అధికారుల నుండి అప్రూవల్ ఆర్డర్ వచ్చిన ప్రకారము హక్కు పొందిన పిదప షాపు స్వాధీనపర్చబడును. (8) దేవాలయము వద్ద మత్స్య, మాంస, మత్తుపానీయాలు, క్రిమి సంహారక మందుల వ్యాపారము చేయరాదు. (9) పాటదారులు భక్తులతో మర్యాదగా మెలగవలెను. వారితో ఎలాంటి గొడవలు చేయరాదు. అట్లు చేసిన యెడల వారి పాటలు రద్దు చేయబడును. (10) హెచ్చుపాట పాడుకొన్న పాటదారుడు 1 సం.ము అద్దె సెక్యూరిటీ డిపాజిట్ వెంటనే చెల్లించవలెను. లీజు కాలపరిమితి ముగిసిన తర్వాత సెక్యూరిటీ డిపాజిట్ ఎటువంటి వడ్డీ లేకుండా తిరిగి చెల్లించబడును. (11) ఈ వేలంపాటలో హిందూయేతరులు పాల్గొనరాదు.

ఇతర వివరములు దేవాలయము కార్యాలయములో పనిచేయు సమయములో తెలుసుకొనవచ్చును.

నూజివీడు 24-12-2024 కార్యనిర్వహణాధికారి

మునిసిపల్ కార్మికుల ధర్నా



నూజివీడు టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో నూజివీడు మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయా లని, సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు.

ఘనంగా మోహన్ రంగా వర్ధంతి



నూజివీడు టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహన్‌రంగా 36వ వర్ధంతిని నూజివీడులో నిర్వహించారు. నూజివీడు పెద్దగాంధీబొమ్మ సెంటర్లో ఉన్న రంగా విగ్రహానికి కాపుసంఘం నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనసేనపార్టీ నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మాఫణిబాబు, నూజివీడు ఏరియాఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయగా, నూజివీడు ఆర్డీవో కార్యాలయం వద్ద వంగవీటి మోహన్‌రంగా విగ్రహానికి టీడీపీ పట్టణ అధ్యక్షులు మల్లిశెట్టి జగదీష్ పూలమాలవేసి నివాళులర్పించారు.

పశువులకు వైద్య పరీక్షలు

చాట్రాయి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంలో కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం 52 పాడి గేదెలకు చికిత్స అందించారు. యూనియన్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు శిబిరాన్ని ప్రారంభించారు. పాడి పశువుల పోషణలో తీసుకోవల్సిన యాజమాన్య పద్ధతులు, సీజనల్ వ్యాధులు నివారణ గురించి పశువైద్యుడు మనోజ్ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తిరువూరు క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి, సూపర్‌వైజర్ నరసింహారావు, వేతన కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

సమస్యలపై ఉద్యమించాలి

నూజివీడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి కమ్యూనిస్టు నిరంతరం సమస్యలపై ఉద్యమించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. సీపీఐ ఆవిర్భవించి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని శతవసంతాల్లోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి గ్రామంలో నియోజకవర్గ సీపీఐ ఆధ్వర్యంలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

ముసునూరు: దేశంలో కమ్యూనిస్టు పార్టీ వందేళ్ళ ప్రస్థానంలో ఎన్నో పోరటాలు, త్యాగాలు చేసిందని సీపీఐ నూజివీడు నియోజకవర్గ సమితి నాయకులు నిమ్మగడ్డ నరసింహ అన్నారు. గురువారం చింతలవల్లి, గుడిపాడు, చెక్కపల్లి గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, శతాబ్ది ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమితి నాయకులు నరసింహ, రాష్ట్ర రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావులు ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. నాయకులు సీహెచ్. వెంకటేశ్వరరావు, ఎం.రమేష్, పిల్లి రాజారత్నం, కోనేరు సురేష్ బెనర్జీ, కొక్కిరపాటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ పెద్దింటి అమ్మ వారి దేవస్థానము, కొల్లేటికోట (గ్రామం), కైకలూరు (మండలం), ఏలూరు జిల్లా

సీల్డ్ టెండర్స్/కొటేషన్స్ కొరకు ప్రకటన

Rc.No.08/2024, Dated. 26/12/2024

వ. నెం.	వివరము	కాలపరిమితి	ధరావత్తు	టెండర్ షెడ్యూల్ ధర
1.	శ్రీఅమ్మ వారికి రోజు వారి పూల అలంకరణ కొరకు దండలు, విడి పువ్వులు సరఫరా / ప్రత్యేక అలంకరణ చేయు లైసెన్సు హక్కు కొరకు	01/02/2025 నుండి 31/01/2026 వరకూ (ఒక సంవత్సరం)	10,000/-	500/-
2.	శ్రీఅమ్మవారి దేవస్థానం నందు లడ్డు ప్రసాదం తయారీకి అవసరమగు కిరాణా సరుకులు సప్లై చేయు లైసెన్సు హక్కునకు కొరకు	01/02/2025 నుండి 31/01/2026 వరకూ (ఒక సంవత్సరం)	10,000/-	500/-
3.	శ్రీఅమ్మవారి దేవస్థానం నందు అర్చనలకు అవసరమైన కిరాణా సరుకులు సప్లై చేయు లైసెన్స్ హక్కు కొరకు	01/02/2025 నుండి 31/01/2026 వరకూ (ఒక సంవత్సరం)	10,000/-	500/-
4.	శ్రీఅమ్మవారి దేవస్థానం నందు లడ్డు ప్రసాదం తయారు (లేబర్ వార్జి) చేయు లైసెన్స్ హక్కు కొరకు	01/02/2025 నుండి 31/01/2026 వరకూ (ఒక సంవత్సరం)	10,000/-	500/-
5.	శ్రీఅమ్మ వారి దేవస్థానముకు శానిటేషన్ సామగ్రి సప్లై చేయు లైసెన్స్ హక్కునకు	01/02/2025 నుండి 31/01/2026 వరకూ (ఒక సంవత్సరం)	10,000/-	500/-
6.	శ్రీఅమ్మవారి దేవస్థానం కౌంటర్ నందు అమ్ముటకు రాయలిటీ వస్తువులు సప్లై చేయు లైసెన్స్ హక్కు కొరకు	01/02/2025 నుండి 31/01/2026 వరకూ (ఒక సంవత్సరం)	5,000/-	250/-
7.	శ్రీఅమ్మ వారి దేవస్థానముకు ఫ్లెక్సీలు ప్రింట్ చేసి సప్లై చేయు లైసెన్స్ హక్కునకు	01/02/2025 నుండి 31/01/2026 వరకూ (ఒక సంవత్సరం)	2,000/-	250/-

1. పైన ఉదాహరించిన లైసెన్సు హక్కులు ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మదాయ శాఖ వారి ఉత్తర్వులు జి.ఓ.ఎం.ఎస్.నెంబరు లైసెన్సు రూల్స్ 866 తేదీ 08.08.2003 మరియు జి.ఓ.ఎం.ఎస్. నెంబరు 426 తేదీ 9.11.2015 మరియు కమీషనరు, దేవదాయ ధర్మదాయ శాఖ వారి ఉత్తర్వులు ఆర్ సి.నెంబరు 894/ జే1/2019 తేదీ 28/01/2020ని అనుసరించి లైసెన్సు హక్కుల కొరకు సీల్డ్ టెండర్స్ /కొటేషన్స్ దేవదాయ శాఖ అధికారుల సమక్షములో జరుపబడును. 2. సదరు సంస్థ హిందూ మత సంస్థ కావున హిందువులు మాత్రమే టెండర్ దాఖలు చేయుటకు/ పాటలో పాల్గొనుటకు అర్హులు మరియు దేవస్థానముతో బకాయిలు ఉన్నవారు, కోర్టు వ్యాజ్యములు ఉన్నవారు టెండర్/బహిరంగ వేలము పాటలో పాల్గొనుటకు అనర్హులు. 3. టెండర్ షెడ్యూల్ దేవస్థానము కార్యాలయము పని వేళలో ది.06-01-2025 నుండి 08-01-2025 వరకు విక్రయించబడును. 4. సీల్డ్ టెండర్స్ దాఖలు చేయు తేదీ ది.09/01/2025 ఉదయం 10.00 గం. నుండి మధ్యాహ్నము 1.00 గం. వరకు, అనంతరము సీల్డ్ టెండర్స్ ను మధ్యాహ్నము 2.00 గం.కు దేవస్థానము కార్యాలయం నందు హాజరైన సీల్డ్ టెండర్స్ దారుల సమక్షంలో తెరువబడును. 5. సీల్డ్ టెండర్స్ తెరిచి, సీల్డ్ టెండర్స్‌ను పరిపోల్చి ఎవరు తక్కువ మొత్తమును కోట్ చేస్తే వారిని లైసెన్స్ హక్కు కొరకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయబడును. 6. టెండర్ వేయువారు పైన ఉదహరించిన ధరావతు సొమ్ము/డి.డి. ను టెండరు కవరులో వేయవలెను. ధరావతు సొమ్ము లేని టెండర్లు పరిశీలించబడవు. 7. సదరు సీల్డ్ టెండర్స్ వాయిదా వేయుటకు గాని, కారణం తెలుపకుండ నిలుపుదల చేయుటకు గాని కార్యనిర్వహణాధికారి వారికి పూర్తి అధికారము కలదు. 8. సీల్డ్ టెండర్ కవరు పైన టెండర్ వివరము మరియు టెండర్ దారు చిరునామా, ఫోన్ నెంబర్ తో సహా వివరముగా వ్రాయవలెను. ఇతర వివరములకు క్రింద ఇచ్చిన నెంబర్ కు ఫోను చేసి మరింత సమాచారము తెలుసుకోవలెను.

కొల్లేటికోట. 26/12/2024.

శ్రీ అమ్మ వారి సేవలో
మాచిపూడి శ్రీనివాసు, కార్యనిర్వహణాధికారి,
ఫోను నెంబర్: 9177145150